ప్రజా మంటలు

తెలంగాణ జాతీయ దినపత్రిక

ఎడిటర్ : సిహెచ్.వి. ప్రభాకర్ రావు

వీణవంక జాతరలో పోలీసులపై వివాదాస్పద వ్యాఖ్యలు

పోలీసులకు "సారీ" చెప్పిన పాడి కౌశిక్ రెడ్డి...

ప్రచురణ : జగిత్యాల సంపుటి : 05 సంచిక : 204 పేజీలు : 04 వెల రూ. 2 శనివారం 31 - 01 - 2026

రేవంత్ రెడ్డి హార్వర్డ్ కోర్సు పూర్తి

- తొలి సీఎంగా రేవంత్ రెడ్డి చరిత్ర
- హార్వర్డ్ కెన్నెడీ స్కూల్ లో లీడర్ షిప్ కోర్సును పూర్తి చేసుకున్న రేవంత్
- సర్టిఫికెట్ అందించిన హార్వర్డ్ అధ్యాపకులు
- శిక్షణలో సాధారణ విద్యార్థిలా గడిపిన రేవంత్

హైదరాబాద్ : రాజకీయాలు, పాలనా వ్యవహారాలతో అనునిత్యం ఎంతో బిజీగా ఉండే తెలంగాణ ముఖ్యమంత్రి అరుదైన గౌరవాన్ని దక్కించుకున్నారు. అమెరికాలోని ప్రతిష్ఠాత్మక హార్వర్డ్ కెన్నెడీ స్కూల్ లో 'లీడర్ షిప్ ఇన్ ది ట్వంటీ ఫస్ట్ సెంచరీ: కాన్ఫ్లిక్ట్ అండ్ కరేజ్' ఎగ్జిక్యూటివ్ ఎడ్యుకేషన్ ప్రోగ్రామ్ ను విజయవంతంగా పూర్తి చేసుకున్నారు. శిక్షణ పూర్తి చేసుకున్న - మిగతా 2 లో

దానం నాగేందర్‌పై బీఆర్ఎస్ అనర్హత పిటిషన్

- విచారణ చేపట్టిన స్పీకర్
- ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్లపై విచారణ చేపట్టిన స్పీకర్
- దానం నాగేందర్‌పై బీఆర్ఎస్ దాఖలు చేసిన అనర్హత పిటిషన్‌పై విచారణ
- సుప్రీంకోర్టు ఆదేశాలతో విచారణ చేస్తున్న స్పీకర్ ప్రసాద్ కుమార్
- పెండింగ్‌లో ఉన్న 3 అనర్హత పిటిషన్లకు సంబంధించి గతంలోనే సుప్రీంకోర్టు వివరణ
- పార్టీ ఫిరాయింపుల వ్యవహారంలో సుప్రీం తీర్పు అమలు చేయలేదని కొద్ది రోజుల క్రితం పిటిషన్
- ఫిబ్రవరి 20 తర్వాత వ్యక్తిగతంగా హాజరవుతానన్న బీజేపీ ఎమ్మెల్యే మహేశ్వర్ రెడ్డి

హైదరాబాద్ : ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్లపై శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ విచారణను ప్రారంభించారు. ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్‌పై బీఆర్ఎస్ పార్టీ నేతలు దాఖలు చేసిన అనర్హత పిటిషన్‌పై సభాపతి విచారణ చేపట్టారు. కౌశిక్ రెడ్డి, ఏలేటి మహేశ్వర్ రెడ్డి, ఇతరులు వేసిన అనర్హత పిటిషన్లపై విచారణ కొనసాగుతోంది. సాక్ష్యాలు నమోదు చేసేందుకు పిటిషనర్లకు విచారణకు పిలిచారు. దీనికి బీజేపీ ఎమ్మెల్యే మహేశ్వర్ రెడ్డి గైర్హాజరయ్యారు. మున్సిపల్ ఎన్నికల దృష్ట్యా హాజరుకాలేనని ఆయన స్పీకర్‌కు సమాచారమిచ్చారు. ఫిబ్రవరి 20 తర్వాత వ్యక్తిగతంగా హాజరవుతానని తెలిపారు. ఏలేటి అభ్యర్థనను పరిగణనలోకి - మిగతా 2 లో

ఫాంహౌస్ లో కేసీఆర్ తో సమావేశమైన కేటీఆర్

- ఎర్రవెల్లి ఫాంహౌస్ లో కొనసాగుతున్న భేటీ
- మున్సిపల్ ఎన్నికలు, సిట్ నోటీసులపై కొనసాగుతున్న చర్చ
- నిన్న కేసీఆర్ తో భేటీ అయిన హరీశ్ రావు

హైదరాబాద్ : బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ తో ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సమావేశమయ్యారు. ఎర్రవెల్లి ఫాంహౌస్ లో వీరి భేటీ కొనసాగుతోంది. మున్సిపల్ ఎన్నికలు, ఫోన్ ట్యాపింగ్ కేసులో సిట్ నోటీసులు తదితర అంశాలపై వీరు చర్చిస్తున్నట్టు సమాచారం. కేసీఆర్ తో నిన్న హరీశ్ రావు భేటీ అయిన సంగతి తెలిసిందే. సిట్ అడిగే ప్రశ్నలు, సమాధాలు ఇచ్చే సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, తదితర - మిగతా 2 లో

అణ్వస్త్ర నిల్వల్లో భారత్ ముందంజ

- మారుతున్న భద్రతా సమీకరణాలు
- అణ్వస్త్రాల సంఖ్యలో పాకిస్థాన్‌ను అధిగమించిన భారత్
- భారత్ వద్ద 180, పాకిస్థాన్ వద్ద 170 అణు వార్‌హెడ్‌లు ఉన్నట్లు అంచనా
- అమెరికా, రష్యా మధ్య కీలక అణు ఒప్పందం వచ్చే వారం ముగింపు
- ప్రపంచవ్యాప్తంగా పెరుగుతున్న అణ్వస్త్ర పోటీపై అంతర్జాతీయ ఆందోళన
- రష్యా, చైనా, యూకే కూడా తమ అణ్వస్త్ర నిల్వలను పెంచుకుంటున్న వైనం

పిల్లలకు సోషల్ మీడియా కట్టడి ఆలోచనలో కర్ణాటక సర్కారు

- పిల్లలకు సోషల్ మీడియా యాక్సెస్‌ను నియంత్రించే అంశంపై కర్ణాటక ప్రభుత్వం చర్చ
- ఈ విషయాన్ని అసెంబ్లీలో వెల్లడించిన మంత్రి ప్రియాంక్ ఖర్గే
- మైనర్లపై సోషల్ మీడియా దుష్ప్రభావంపై బీజేపీ ఎమ్మెల్యే ఆందోళన
- ఆస్ట్రేలియా, యూకే వంటి దేశాల తరహాలో చర్యలు తీసుకునే యోచన

2 లో

ఈ నెల 11 నుంచి ఏపీ అసెంబ్లీ సమావేశాలు... 14న బడ్జెట్!

- నోటిఫికేషన్ జారీ చేసిన గవర్నర్ అబ్దుల్ నజీర్
- ఉభయ సభలను ఉద్దేశించి ప్రసంగం
- ఫిబ్రవరి 14న వార్షిక బడ్జెట్ ప్రవేశపెట్టనున్న ఆర్థిక మంత్రి పయ్యావుల
- అదే రోజున వ్యవసాయ బడ్జెట్‌ను సమర్పించనున్న మంత్రి అచ్చెన్నాయుడు
- దాదాపు నాలుగు వారాల పాటు కొనసాగనున్న సమావేశాలు

2 లో

అసలు పని ఇప్పుడే మొదలైంది

- రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్
- కాకినాడ జేఎన్టీయూలో విద్యార్థులతో లోకేశ్ ముఖాముఖి కార్యక్రమం
- అన్ని రంగాల్లో ఏపీని నెంబర్ వన్ గా నిలపడమే లక్ష్యమని స్పష్టీకరణ
- పాదయాత్ర అనుభవాలు ప్రభుత్వంలో అమలు చేస్తున్నామన్న యువనేత
- నైతిక విలువల కోసం చాగంటిని సలహాదారుగా నియమించామని వెల్లడి

అమరావతి : "ప్రభుత్వంలోకి రావడంతోనే మా పని పూర్తికాలేదు, అసలు పని ఇప్పుడే మొదలైంది" అంటూ రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ స్పష్టం చేశారు. ఇచ్చిన హామీలను నెరవేర్చి, ఆంధ్రప్రదేశ్‌ను అన్ని రంగాల్లో నెంబర్ వన్ స్థానంలో నిలబెట్టడమే తమ ప్రభుత్వ ధ్యేయమని అన్నారు. శుక్రవారం కాకినాడ జేఎన్టీయూలో 'హలో లోకేశ్' పేరిట నిర్వహించిన ముఖాముఖి కార్యక్రమంలో ఆయన విద్యార్థులతో మాట్లాడారు. ఈ కార్యక్రమానికి జేఎన్టీయూ ఈసీఈ మూడో సంవత్సరం విద్యార్థిని ప్రాప్తి యాంకర్ గా వ్యవహరించారు.జీవితంలో తీసుకునే కొన్ని నిర్ణయాలే భవిష్యత్తును నిర్దేశిస్తాయని, తన జీవితంలో పాదయాత్ర అలాంటి కీలక నిర్ణయమని లోకేశ్ అన్నారు. పాదయాత్ర ద్వారా కోట్లాది మంది ప్రజలు, యువత ఆశలు, ఆకాంక్షలు, సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకునే అవకాశం లభించిందని తెలిపారు. ఆ యాత్రలో తాను ఎంతో నేర్చుకున్నానని, నాటి అనుభవాలనే ఇప్పుడు ప్రభుత్వంలో అమలు చేస్తున్నామని వివరించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే యువతకు 4 లక్షల ఉద్యోగాలు కల్పించామని వెల్లడించారు. అభివృద్ధి - మిగతా 2 లో

తెలంగాణ జల ద్రోహానికి కాంగ్రెస్ ప్రభుత్వం బాధ్యత వహించాలి

హరీష్ రావు

నీటి చరిత్రలో 'బ్లాక్ డే'గా మిగిలే ప్రమాదం

హైదరాబాద్, జనవరి 30 (ప్రజా మంటలు) : రాజకీయాలకన్నా తెలంగాణ రాష్ట్ర ప్రయోజనాలే తమకు ముఖ్యమని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీష్ రావు స్పష్టం చేశారు. శుక్రవారం తెలంగాణ భవన్‌లో అత్యవసరంగా ప్రెస్‌మీట్ నిర్వహించిన ఆయనఁ రాష్ట్రానికి జరుగుతున్న తీవ్రమైన జల ద్రోహాన్ని దేశరాజధాని ఢిల్లీ కేంద్రంగా ప్రజల ముందుకు తీసుకొచ్చామని తెలిపారు. ఈ పరిస్థితిని కాంగ్రెస్ ప్రభుత్వమే కల్పించిందని తీవ్రంగా విమర్శించారు.తెలంగాణ నీటిని ఆంధ్రప్రదేశ్‌కు దోచిపెడుతున్నది సీఎం హోదాలో ఉన్న రేవంత్ రెడ్డేనని హరీష్ రావు ఆరోపించారు. "ఈ ప్రాంతం వాడే తెలంగాణకు ద్రోహం చేస్తాడని కాళోజీ ముందే చెప్పినట్లే జరుగుతోంది" అంటూ ఘాటు వ్యాఖ్యలు చేశారు. పక్కా ప్రణాళిక ప్రకారమే పోలవరంనల్లమల సాగర్‌కు రాష్ట్ర ప్రభుత్వం సహకరిస్తోందని, అందులో భాగంగానే సుప్రీంకోర్టులో చెల్లని రిట్ పిటిషన్ వేసి తిరిగి వెనక్కి తీసుకున్నారని ఎద్దేవా చేశారు.ఒకవేళ ఈ తప్పు జరిగితేఁ తెలంగాణ నీటి చరిత్రలో ఈ రోజు శాశ్వతంగా ఒక లి"బ్లాక్ డే"లిగా మిగిలిపోతుందని హరీష్ రావు హెచ్చరించారు. గోదావరి జలాల అక్రమ తరలింపు విషయంలో బీఆర్ఎస్ పార్టీ మొదటి నుంచే అప్రమత్తం చేస్తూనే వస్తోందని, అయినా కాంగ్రెస్ ప్రభుత్వం కావాలనే పెడచెవిన పెడుతోందన్నారు.గతంలో ఈ అంశంపై అనేకసార్లు ప్రెస్‌మీట్‌లు పెట్టి వాస్తవాలు బయటపెట్టినా, ప్రభుత్వం మాత్రం నామమాత్రంగా బ్యాక్‌డేట్ లేఖలు విడుదల చేసి చేతులు దులుపుకుందని దుయ్యబట్టారు. "ముల్లు కర్రతో పొడుస్తూ మొద్దు నిద్ర లేపుతున్నా కాంగ్రెస్ ప్రభుత్వం తప్పులు చేస్తూనే ఉంది" అంటూ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.బనకచర్ల అయినా, నల్లమల సాగర్ అయినా పేరు మాత్రమే మారిందని, కానీ ఆంధ్రప్రదేశ్ జల దోపిడీ మాత్రం ఆగలేదని హరీష్ రావు స్పష్టం చేశారు. "జల ద్రోహంలో కత్తి చంద్రబాబుది అయితే, పొడిచేది రేవంత్ రెడ్డి" అంటూ ఘాటు వ్యాఖ్యలు చేశారు.సమైక్య పాలనలోనే తెలంగాణకు నీటి వాటాల్లో తీరని అన్యాయం చేసిన కాంగ్రెస్ పార్టీ, ఇప్పుడు మరో చారిత్రక ద్రోహానికి పాల్పడుతోందని విమర్శించారు. ఈ రోజు ఢిల్లీలో జరుగుతున్న ఇరిగేషన్ మీటింగ్ సాక్షిగా రేవంత్ ప్రభుత్వం రాష్ట్రానికి మరణ శాసనం రాయబోతోందని ఆవేదన వ్యక్తం చేశారు.తెలంగాణ ప్రజలు ఈ ద్రోహాన్ని ఎప్పటికీ క్షమించరని, నీటి హక్కుల కోసం బీఆర్ఎస్ చివరి వరకూ పోరాడుతుందని హరీష్ రావు స్పష్టం చేశారు.

సంపాదకీయం

సర్వేలో ఆశావహ స్వరం

ప్రపంచవ్యాప్తంగా అలముకున్న అనిశ్చితికి తోడు, అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ విధిస్తున్న అదనపు సుంకాలు, పడిపోతున్న రూపాయి విలువ, ఉపాధి లేమి తదితరాలు హడలెత్తిస్తున్నాయి. ఇలాంటి స్థితిలో దేన్నయినా అంచనా వేయటమంటే కత్తి మీద సాము. ఈ నేపథ్యంలో కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ గురువారం పార్లమెంటుకు ఆర్థిక సర్వే సమర్పించారు. ముగియబోతున్న ఆర్థిక సంవత్సరంలో మన స్థితిగతులెలా ఉన్నాయో వివరించి, ఇకముందు రాగల సవాళ్లేమిటో... వాటిని అధిగమించటానికి ప్రభుత్వానికున్న ఆలోచనేమిటో స్థూలంగా వివరించటం ఆర్థిక సర్వేల లక్ష్యం. నిజానికి ఆర్థిక సర్వేకు ముందురోజు పార్లమెంటు ఉభయసభలనుద్దేశించి రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము చేసిన ప్రసంగంలో సంస్కరణలు మరింత వేగవంతం కాబోతున్నాయని సూచనప్రాయంగా చెప్పారు. వచ్చే ఆర్థిక సంవత్సరంలో మన జీడీపీ 6.87.2 శాతం మధ్య ఉండొచ్చని ఆర్థిక సర్వే అంచనా వేసింది. ప్రపంచ దేశాలన్నిటా ఆర్థికంగా మందగమనం కొనసాగుతున్నా మన దేశం 'వేగంగా వృద్ధి చెందుతున్న ప్రధాన ఆర్థిక వ్యవస్థ'గా కొనసాగుతుందన్న ఆశాభావం వ్యక్తం చేసింది. ఇలా ఆశించటానికి కారణం ఉంది. వృద్ధి రేటు బలంగా ఉండటం, మునుపెన్నడూ లేనంతగా ద్రవ్యోల్బణం అదుపులో ఉండటం సామాన్యమైన విషయం కాదు. ఇటువంటి ఆర్థిక వ్యవస్థను ఆర్థిక నిపుణులు 'గోల్డీలాక్స్ ఎకానమీ' అంటారు. దేశం ఏదైనా, పాలకులు ఎంతగానో కోరుకునే సమతౌల్య స్థితి ఇది. స్వేచ్ఛగా ప్రాథమ్యాలను ఎంచుకోవటానికీ, దూకుడుగా ముందుకు పోయేందుకూ అనువైన బడ్జెట్‌ను రూపొందించుకొనేందుకు ఇది వీలు కల్పిస్తుంది. కానీ ఒడుదొడుకులు ఉన్నా యని ఆర్థిక సర్వే గమనిస్తే అర్థమవుతుంది. 202526 సంవత్సరానికి గణాంకాల మంత్రిత్వ శాఖ లోగడ అంచనా వేసిన వాస్తవ స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ) 7.4 శాతంకాగా, అది అంతకన్నా తక్కువే ఉంటుందని సర్వే చెబుతోంది. పన్ను వసూళ్లలో 11 శాతం వృద్ధి ఉండొచ్చని నిరుడు అంచనా వేస్తే అది 8 శాతం మించలేదు. నిరుడంతా విదేశీ మదుపుదారులు 1,900 కోట్ల డాలర్లమేర వెనక్కి తీసుకోగా, ఈ జనవరిలోనే 400 కోట్ల డాలర్ల ఈక్విటీలు విక్రయించారు. సంస్కరణలు మొదలయ్యాక ఇలా జరగటం ఇదే ప్రథమం. అయితే విదేశీ మారక నిల్వల్లో మనం ప్రపంచ దేశాల్లో అగ్రస్థానంలో ఉన్నామని సర్వే వివరిస్తోంది. ఈ నిల్వలు 701.4 బిలియన్ డాలర్లకు చేరుకున్నాయని చెబుతోంది. అలాగే ప్రవాస భారతీయుల ద్వారా వచ్చే విదేశీ మారక ద్రవ్యం కూడా భారీగా పెరిగింది. ముగుస్తున్న సంవత్సరంలో ఇది 135.4 బిలియన్ డాలర్లు. దేశ ఆర్థిక వ్యవస్థను పీడిస్తున్న సమస్యలకు మూలం ప్రపంచ స్థితిగతుల్లో ఉంది తప్ప అది అంతర్గతమైంది కాదని సర్వే ప్రకటించింది. అయితే తయారీ రంగ పరిశ్రమలు విస్తరించి, ప్రజల కొనుగోలు శక్తి పెరిగేలా చూడటం మన బాధ్యతే. కృత్రిమ మేధ(ఏఐ)తో ఉద్యోగాలు పోతాయన్న భయాలు అవాస్తవమనీ, పైపెచ్చు తగిన మార్పులు చేస్తే ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయనీ సర్వే అంటున్నది. డిజిటల్ ప్లాట్‌ఫాంల ద్వారా, యాప్‌ల ద్వారా దేశంలో శరవేగంతో విస్తరిస్తున్న 'గిగ్ ఎకానమీ'పై ఈ సర్వే దృష్టి సారించటం ప్రశంసనీయం. 2021లో ఈ రంగంలో 77 లక్షల మంది ఉండగా, వారి సంఖ్య ప్రస్తుతం కోటీ 20 లక్షలు. కానీ దాదాపు 40 శాతం మంది నెలకు రూ. 15,000 కన్నా తక్కువే సంపాదిస్తున్నారని చెబుతూ... గంటకు నిర్ణీత మొత్తం ఇచ్చేలా, లేక నిర్దేశించిన లక్ష్యానికి ఫలానా మొత్తం అనే విధంగా ఉంటే మెరుగైన ఆర్జన సాధ్యమవుతుందని సర్వే భావించింది. వారి పని పరిస్థితులు మెరుగయ్యేలా చూస్తామని వాగ్దానం చేస్తోంది. అయితే సామాజిక రంగంలో ప్రభుత్వ వ్యయాన్ని మరింత పెంచితే తప్ప, ఉగ్రరూపం దాలుస్తున్న ఉపాధి లేమిని సరిచేస్తే తప్ప వాస్తవ అభివృద్ధి సాధ్యపడదు. ముఖ్యంగా విద్య, వైద్య రంగాల్లో ప్రభుత్వ వ్యయం చాలా తక్కువుంది. ఆ రంగాలపై శ్రద్ధ పెట్టనంతకాలం నాసిరకం చదువులు, అనారోగ్యం, పౌష్టికాహార లోపం వంటి సమస్యలు పీడిస్తూనే ఉంటాయి. ఆ దిశగా ప్రభుత్వం ఆలోచిస్తున్నదేమిటో రెండు రోజుల్లో రాబోయే బడ్జెట్ తేటతెల్లం చేస్తుంది.

అసలు పని ఇప్పుడే మొదలైంది

మొదటిపేజీ తరువాయి - వికేంద్రీకరణ, క్లస్టర్ ఆధారిత అభివృద్ధికి తమ ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. విద్యార్థుల నుంచి సూచనలు స్వీకరించేందుకు, వారి మనోగ తాన్ని తెలుసుకునేందుకు ఇకపై ప్రతినెలా విద్యార్థులతో సమావేశం కావాలని నిర్ణయిం చుకున్నట్లు చెప్పారు. విద్యార్థులు ఇచ్చే ఫీడ్‌బ్యాక్‌ను సీరియస్‌గా తీసుకుని, పాఠ్యప్రణాళిక మెరుగుదలకు ఉపయోగిస్తామని హామీ ఇచ్చారు. సీఎస్ఆర్ తరహాలో పరిశ్రమలు కూడా పరిశోధనలకు నిధులు కేటాయించాలని ఆయన సూచించారు. మనం ఏ స్థాయిలో ఉన్నా నైతిక విలువలను మరవద్దని విద్యార్థులకు హితవు పలికారు. పిల్లలను సోషల్ మీడియాకు దూరంగా ఉంచేలా చర్యలు తీసుకుంటున్నామని, అదే సమయంలో నైతిక విలువలు నేర్పించేందుకు ప్రముఖ ప్రవచనకర్త చాగంటి కోటేశ్వరరావును ప్రభుత్వ సలహాదారుగా నియమించామని తెలిపారు. ఆయనకు కేబినెట్ ర్యాంకు ఇచ్చినా, ప్రభుత్వం నుంచి ఎలాంటి సదుపాయాలు తీసుకోవడం లేదని గుర్తుచేశారు. 'అమ్మకు చెప్పలేని పని మనం చేయకూడదు' అనే చాగంటి మాట ఎంతో శక్తిమంతమైనదని లోకేశ్ పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్‌ను అగ్రగామిగా నిలబెట్టాలన్న లక్ష్యంలో విద్యార్థులంతా భాగస్వాములు కావాలని, వారి భవిష్యత్తును ఉన్నతంగా తీర్చిదిద్దేందుకు శక్తివంచన లేకుండా కృషి చేస్తానని లోకేశ్ భరోసా ఇచ్చారు.

రేవంత్ రెడ్డి హార్వర్డ్ కోర్సు పూర్తి

మొదటిపేజీ తరువాయి - రేవంత్ కు హార్వర్డ్ అధ్యాపకులు సర్టిఫికెట్ ప్రదానం చేశారు. అధికారంలో ఉండగానే ఈ సర్టిఫికెట్ పొందిన తొలి భారతీయ ముఖ్యమంత్రిగా రేవంత్ చరిత్ర సృష్టించారు. ఈ ప్రోగ్రామ్ లో ప్రపంచ వ్యాప్తంగా 20కి పైగా దేశాల నుంచి 62 మంది విద్యార్థులు పాల్గొన్నారు. జనవరి 25న ఈ ఎడ్యుకేషన్ ప్రోగ్రామ్ ప్రారంభమయింది. ప్రతి రోజు ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు సుదీర్ఘంగా క్లాసులు జరిగాయి. ఈ శిక్షణలో రేవంత్ సాధారణ విద్యార్థిలా గడిపారు. 21వ శతాబ్దంలో ప్రపంచానికి ఎదురయ్యే సవాళ్లు, నాయకత్వ మెళకువలు, సంక్షోభ పరిస్థితులను ధైర్యంగా ఎలా ఎదుర్కోవాలనే అంశాలపై కేస్ స్టడీలు, గ్రూప్ ప్రాజెక్టుల ద్వారా వీరికి శిక్షణ కొనసాగింది. మంచు తుపాను కారణంగా అక్కడి ఉష్ణోగ్రతలు -24 డిగ్రీలకు పడిపోయినప్పటికీ... విరామం తీసుకోకుండా రేవంత్ క్లాసులకు హాజరయ్యారు.ఐ

ఫాంహౌస్ లో కేసీఆర్ తో సమావేశమైన కేటీఆర్

మొదటిపేజీ తరువాయి - అంశాలపై వీరు చర్చించినట్టు తెలుస్తోంది. కేసీఆర్ కు అందిన నోటీసులను ఎలా ఎదుర్కోవాలి, ఈ విషయాన్ని పార్టీకి నష్టం కలగకుండా ప్రజల్లోకి ఎలా తీసుకెళ్లాలి అనే అంశంపై నిన్న హరీశ్ తో, ఈరోజు కేటీఆర్ తో చర్చిస్తున్నట్టు సమాచారం. రాబోయే రోజుల్లో రాజకీయ పరంగా ఎలాంటి అడుగులు వేయాలి, ఎలాంటి ప్రజా ఉద్యమాలను నిర్మించాలి, మీడియా ముందుకు ఎలాంటి అంశాలను తీసుకెళ్లాలనే అంశాలపై చర్చ జరుగుతోంది. మున్సిపల్ ఎన్నికలను బీఆర్ఎస్ పార్టీ ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంది. ఈ ఎన్నికల్లో విజయం సాధించి కాంగ్రెస్ పార్టీ దూకుడు తగ్గించాలనే పట్టుదలతో ఉంది.

చదువు అనేది గేమ్‌ఛేంజర్

మొదటిపేజీ తరువాయి - అన్నారు. ఫలితాలు బాగుండటంతో రాష్ట్ర వ్యాప్తంగా అమలు చేసేలా కార్యక్రమం రూపొందించామని తెలిపారు.

పూర్వ విద్యార్థులు ముందుకు రావాలి : ప్రపంచంలో ఉండే వైద్య సాంకేతికత మొత్తాన్ని, అత్యవసర వైద్యం అందించేందుకు వీలుగా ఎయిర్ అంబులెన్స్‌లు, డ్రోన్లు అందుబాటులోకి తెస్తామన్నారు. విదేశాల్లో ఉన్న వైద్య నిపుణులు అమరావతికి తిరిగి రావాలని విజ్ఞప్తి చేశారు. జింకానా తరపున ఎంసీహెచ్ బ్లాక్ ఏర్పాటు చేసినట్లే రాష్ట్రంలోని మిగతా కళాశాలల్లో పూర్వ విద్యార్థులు ముందుకు రావాలన్నారు. సంపాదన వల్ల మనిషికి తృప్తి రాదని, ఆ డబ్బును సమాజానికి తిరిగి ఇవ్వడంలోనే నిజమైన సంతోషం దాగి ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తరపున చేపట్టిన పీ-4 కార్యక్రమంలో భాగస్వాములు కావాలని చంద్రబాబు పిలుపునిచ్చారు. పీపీపీ విధానం వల్లే దేశంలోని జాతీయ రహదారులు అద్భుతంగా తయారయ్యాయని అందుకే వైద్య రంగంలో మౌలిక వసతుల కల్పన ఈ విధానాన్ని అమలు చేస్తున్నట్లు తెలిపారు.

సంపాదనలో కొంతభాగం సమాజానికి : "ఆర్థిక అసమానతలు తగ్గాలి పేదరికం లేని సమాజం చూడాలి. ఆర్థిక అసమానతలు తగ్గించే వ్యవస్థకు శ్రీకారం చుట్టాలి. పీ4 కార్యక్రమానికి ముందుకు రావాలని అందరినీ కోరుతున్నా. సంపాదనలో కొంతభాగం సమాజానికి వెచ్చించాలి. ప్రపంచంలోని అతిపెద్ద ఆర్థిక వ్యవస్థలో భారత్ నాలుగో స్థానంలో ఉంది. 2028 నాటికి మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్ తయారవుతుంది. 2038 నాటికి రెండో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్ తయారవుతుంది. 2047 నాటికి ప్రపంచంలోనే ప్రథమస్థానంలో భారత్ ఉండాలనేది మనందరి ఆకాంక్ష. స్వర్ణాంధ్ర విజన్ 2047 తయారుచేశాం" అని సీఎం చంద్రబాబు వెల్లడించారు. "మనం మాత్రమే కాదు, సమాజం కూడా బాగుండాలనేది మన సంస్కృతి. అనేక సేవా కార్యక్రమాలకు ముందుకొచ్చి భారీగా విరాళాలు ఇస్తున్నారు. పిల్లలు ఎంత పెద్దవాళ్లయినా జీవితాంతం ఏ సహాయం కావాలన్నా అందించే సంస్కృతి మనది. రూ. 100 కోట్లు ఖర్చు పెట్టి మాతా శిశు సంరక్షణ కేంద్రం ఏర్పాటు చేశారు. చైతన్యం పెరిగింది సేవా కార్యక్రమాలకు చాలామంది ముందుకొస్తున్నారు. జన్మభూమి కార్యక్రమానికి పిలుపు ఇవ్వగానే అభివృద్ధికి దోహదం చేశారు. ఆర్థిక అసమానతలు తగ్గితేనే సమాజం బాగుంటుంది. చదువు అనేది గేమ్‌ఛేంజర్ సరైన సమయంలో నిర్ణయాలు ఉండాలి. భారతరత్నకు మారుపేరుగా కలాం నిలిచారు. సాధారణ కుటుంబంలో పుట్టినా ఆత్మవిశ్వాసంతో ముందుకెళ్తే ఉన్నత స్థితికి చేరుకుంటారు." - సీఎం చంద్రబాబు

ఆరోగ్య రంగాన్ని మెరుగుపర్చేందుకే పీపీపీ : రాష్ట్రంలో వైద్య విద్యను, ఆరోగ్య రంగాన్ని మెరుగుపర్చేందుకే పీపీపీ విధానాన్ని తీసుకువస్తున్నట్లు వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ స్పష్టం చేశారు. గుంటూరు జీజీహెచ్‌లో మాతా శిశు సంరక్షణ కేంద్రం ప్రారంభోత్సవంలో సీఎంతో పాటు ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడిన సత్య కుమార్, జగన్ కేవలం పది శాతం నిధులు ఖర్చు చేసిన మెడికల్ కలేజీలు పూర్తి చేశామని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. రక్షణ రంగంలో కూడా పీపీపీ అమలు చేస్తుంటే వైద్య రంగంలో పీపీపీ తప్పు ఎలా అవుతుందని ప్రశ్నించారు. తిరుమల నెయ్యి కల్తీ వ్యవహారం పైన వైఎస్సార్సీపీ వితండవాదం చేస్తోందని మండిపడ్డారు. అనంతరం కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ మాట్లాడుతూ, చంద్రబాబు గతంలో హైదరాబాద్‌లో జీనో వ్యాలీ, విశాఖలో మెడిటెక్ జోన్ ఏర్పాటు చేయడం వల్లే వైద్య రంగం పురోగతి చెందిందని అన్నారు. గుంటూరు జీజీహెచ్‌లో అదనపు బ్లాకుల నిర్మాణానికి తులసి రామ చంద్ర ప్రభు రూ. 10 కోట్లు ఇచ్చారని మరి కొందరు దాతలు కూడా అభివృద్ధి కోసం ముందుకు వచ్చారని తెలిపారు. గతంలో టీడీపీ అధికారంలో ఉండగా శిలాఫలకాలు వేసిన ప్రాజెక్టులను వైఎస్సార్సీపీ నిలిపివేసిందని కూటమి వచ్చాక వాటన్నింటిని పూర్తి చేస్తున్నట్లు వివరించారు.

అణ్వస్త్ర నిల్వల్లో భారత్ ముందంజ

మొదటిపేజీ తరువాయి - ప్రపంచవ్యాప్తంగా అణ్వస్త్ర పోటీ కొత్త ఆందోళనలకు తెరలేపుతున్న తరుణంలో, దక్షిణాసియాలో కీలక పరిణామం చోటుచేసుకుంది. అణు వార్‌హెడ్ల సమీకరణలో భారత్ తన పొరుగు దేశం పాకిస్థాన్‌ను అధిగమించింది. అంతర్జాతీయ నివేదికల ప్రకారం, భారత్ తన అణు సామర్థ్యాన్ని మరింత పటిష్ఠం చేసుకుంటుండగా, మరోవైపు అగ్రరాజ్యాల మధ్య ఉన్న కీలక అణు నియంత్రణ ఒప్పందం ముగింపు దశకు రావడం ప్రపంచ భద్రతపై నీలినీడలు కమ్ముకునేలా చేస్తోంది. ఫెడరేషన్ ఆఫ్ అమెరికన్ సైంటిస్ట్స్ తాజా అంచనాల ప్రకారం, 2025 నాటికి భారత్ వద్ద అణు వార్‌హెడ్ల సంఖ్య 180కి చేరింది. గతేడాది ఈ సంఖ్య 172గా ఉండగా, తాజాగా మరో 8 వార్‌హెడ్‌లను సమకూర్చుకుంది. అదే సమయంలో పాకిస్థాన్ వద్ద అణ్వస్త్రాల సంఖ్య 170 వద్దే స్థిరంగా ఉంది. అణ్వస్త్రాల విషయంలో రష్యా (4,309), అమెరికా (3,700) అగ్రస్థానంలో కొనసాగుతుండగా, చైనా వద్ద 600 వార్‌హెడ్‌లు ఉన్నాయని నివేదిక పేర్కొంది. ఫ్రాన్స్, యునైటెడ్ కింగ్‌డమ్, ఇజ్రాయెల్, ఉత్తర కొరియా కూడా అణ్వస్త్ర సామర్థ్యం కలిగిన దేశాల జాబితాలో ఉన్నాయి. పాకిస్థాన్‌తో పాటు ముఖ్యంగా చైనా నుంచి ఎదురవుతున్న భద్రతాపరమైన సవాళ్లే భారత్ తన అణు సామర్థ్యాన్ని పెంచుకోవడానికి ప్రధాన కారణంగా విశ్లేషకులు భావిస్తున్నారు. చైనాలోని సుదూర ప్రాంతాలను సైతం లక్ష్యంగా చేసుకోగల దీర్ఘశ్రేణి క్షిపణులపై భారత్ దృష్టి సారించింది. ఒకే క్షిపణితో బహుళ లక్ష్యాలను ఛేదించగల 'మల్టిపుల్ ఇండిపెండెంట్‌లీ టార్గెటబుల్ రీ-ఎంట్రీ వెహికల్స్' (వీ×=ఎ) టెక్నాలజీని కూడా అభివృద్ధి చేస్తోంది. మరోవైపు, సంప్రదాయ సైనిక శక్తిలో తనకంటే పెద్దదైన భారత్‌ను నిలువరించడమే లక్ష్యంగా పాకిస్థాన్ తన అణు కార్యక్రమాన్ని కొనసాగిస్తోంది. భారత్ 'మొదటగా అణుదాడి చేయబోమనే' విధానానికి కట్టుబడి ఉన్నట్లు చెబుతున్నా, 2019లో రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ చేసిన వ్యాఖ్యలు ఈ విధానంపై కొంత అనిశ్చితిని సృష్టించాయి. అయితే, పాకిస్థాన్ మాత్రం ఇలాంటి విధానాన్ని అధికారికంగా ప్రకటించలేదు. గత ఏడాది మే నెలలో ఇరు దేశాల మధ్య 88 గంటల పాటు కొనసాగిన ఉద్రిక్తతలు, అణు దేశాల మధ్య చిన్నపాటి ఘర్షణలు కూడా ఎంతటి పెను ప్రమాదానికి దారితీయగలవో గుర్తుచేశాయి. ఈ పరిణామాలు జరుగుతున్న తరుణంలోనే, అగ్రరాజ్యాలైన అమెరికా, రష్యాల మధ్య ఉన్న 'న్యూ స్టార్ట్' అణు ఒప్పందం వచ్చే వారం ఫిబ్రవరి 4తో ముగియనుంది. దీనికి ప్రత్యామ్నాయ ఒప్పందం కుదరకపోవడంతో, గత 50 ఏళ్లలో ఇరు దేశాల మధ్య అణ్వాయుధాలపై ఎలాంటి పరిమితులు లేని పరిస్థితి ఏర్పడటం ఇదే తొలిసారి కానుంది. ఇది ప్రపంచవ్యాప్తంగా కొత్త అణ్వస్త్ర పోటీకి దారితీయవచ్చని, ఇరు పక్షాల వ్యూహాత్మక ప్రణాళికలు "అనిశ్చితి, తీవ్ర పరిణామాల అంచనాల" ఆధారంగా నడిచే ప్రమాదం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఒకప్పుడు అమెరికా తన అణ్వస్త్రాలను తగ్గిస్తుండగా, ఇప్పుడు రష్యా, చైనా, భారత్, పాకిస్థాన్, యూకే వంటి దేశాలు తమ నిల్వలను పెంచుకోవడం ప్రపంచ భద్రతకు కొత్త సవాలుగా మారింది.

ఈ నెల 11 నుంచి ఏపీ అసెంబ్లీ సమావేశాలు... 14న బడ్జెట్!

మొదటిపేజీ తరువాయి - ఆంధ్రప్రదేశ్ శాసనసభ బడ్జెట్ సమావేశాలకు ముహూర్తం ఖరారైంది. 16వ శాసనసభ ఐదో సమావేశాలను ఫిబ్రవరి 11వ తేదీ నుంచి నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్ అసెంబ్లీని సమావేశాలపై నోటిఫికేషన్ జారీ చేశారు. ఫిబ్రవరి 11న ఉదయం 10 గంటలకు అమరావతిలోని వెలగపూడిలో ఉన్న అసెంబ్లీ హాలులో ఉభయ సభలను (శాసనసభ, శాసనమండలి) ఉద్దేశించి గవర్నర్ ప్రసంగించడంతో ఈ సమావేశాలు అధికారికంగా ప్రారంభం కానున్నాయి. గవర్నర్ ప్రసంగం అనంతరం, సభలో ఆయనకు ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చ జరుగుతుంది. ఫిబ్రవరి 12న ఈ తీర్మానంపై చర్చ ప్రారంభం కానుండగా, ఫిబ్రవరి 13న ముఖ్యమంత్రి చంద్రబాబు ఈ చర్చకు సమాధానం ఇస్తారు. ఈ సమావేశాల్లో అత్యంత కీలకమైన 2026-27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన వార్షిక బడ్జెట్‌ను ఫిబ్రవరి 14న ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ సభలో ప్రవేశపెట్టనున్నారు. అదే రోజున వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ప్రత్యేక వ్యవసాయ బడ్జెట్‌ను సమర్పిస్తారు. దాదాపు నాలుగు వారాల పాటు ఈ సమావేశాలు జరిగే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. రాష్ట్ర ప్రభుత్వ వార్షిక బడ్జెట్‌కు శాసనసభ ఆమోదం పొందడం ఈ సమావేశాల ప్రధాన ఉద్దేశం.

పిల్లలకు సోషల్ మీడియా కట్టడి ఆలోచనలో కర్ణాటక సర్కారు

మొదటిపేజీ తరువాయి - పిల్లలకు సోషల్ మీడియా వినియోగాన్ని నియంత్రించే అంశంపై కర్ణాటక ప్రభుత్వం తీవ్రంగా చర్చిస్తున్నట్లు రాష్ట్ర ఐటీ, బీటీ శాఖ మంత్రి ప్రియాంక్ ఖర్గే తెలిపారు. దీనివల్ల ఎదురయ్యే ప్రమాదాలను దృష్టిలో ఉంచుకుని ఈ దిశగా ఆలోచిస్తున్నట్లు శుక్రవారం శాసనసభలో ఆయన వెల్లడించారు. బీజేపీ సీనియర్ ఎమ్మెల్యే ఎస్. సురేశ్ కుమార్ ఈ అంశంపై ఆందోళన వ్యక్తం చేయగా, మంత్రి స్పందించారు. ఈ విషయం చాలా తీవ్రమైనదని, ఇప్పటికే ఫిన్‌లాండ్, యూకే, ఆస్ట్రేలియా వంటి దేశాలు పిల్లల సోషల్ మీడియా వినియోగంపై కఠిన చర్యలు తీసుకుంటున్నాయని ప్రియాంక్ ఖర్గే గుర్తుచేశారు. "ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, సోషల్ మీడియాను బాధ్యతాయుతంగా ఎలా ఉపయోగించాలనే దానిపై మేం చర్చిస్తున్నాం. ఈ అంశం ప్రస్తుతం పరిశీలనలో ఉంది" అని ఆయన తెలిపారు. ఇప్పటికే మెటా సంస్థ సహకారంతో రాష్ట్రంలో 'డిజిటల్ డిటాక్స్' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని, ఇందులో దాదాపు 3 లక్షల మంది విద్యార్థులు, లక్ష మంది ఉపాధ్యాయులు పాల్గొంటున్నారని వివరించారు. అంతకుముందు సభలో మాట్లాడిన సురేశ్ కుమార్, 16 ఏళ్లలోపు పిల్లలకు సోషల్ మీడియాను ఆస్ట్రేలియా నిషేధించిందని ప్రస్తావించారు. "పిల్లలు యుక్తవయస్కులు కాకముందే అశ్లీల కంటెంట్‌కు బానిసలవుతున్నారు. ఇది చాలా ప్రమాదకరం. వెంటనే చర్యలు తీసుకోకపోతే మన పాఠశాలలు, కుటుంబ వ్యవస్థలు నాశనమవుతాయి" అని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి ముఖ్యమైన అంశాలపై రాజకీయాలకు అతీతంగా నిర్ణయాలు తీసుకోవాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

దానం నాగేందర్‌పై బీఆర్ఎస్ అనర్హత పిటిషన్



మొదటిపేజీ తరువాయి - తీసుకుని సభాపతి ఫిబ్రవరి 18కు సమయం ఇచ్చారు. పిటిషనర్ల వాదనలు విని సాక్ష్యాలను స్పీకర్ నమోదు చేయనున్నారు. సుప్రీంకోర్టు ఆదేశాలతో స్పీకర్ ఈ విచారణను చేపట్టారు. పెండింగ్‌లో ఉన్న 3 అనర్హత పిటిషన్లకు సంబంధించి గతంలోనే సుప్రీంకోర్టు వివరణ కోరింది. వెంటనే విచారణ జరిపి రెండు వారాల్లో నివేదిక ఇవ్వాలని స్పీకర్ ప్రసాద్‌కుమార్‌ను ఆదేశించిన విషయం తెలిసిందే. ఖైరతాబాద్ శాసనసభ్యుడు దానం నాగేందర్ అనర్హత పిటిషన్‌కు సంబంధించి స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ చేపట్టిన విచారణకు ఇవాళ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి హాజరయ్యారు. పురపాలక ఎన్నికల హడావుడి ఉన్నప్పటికీ తాను హాజరైనట్లుగా ఆయన తెలిపారు. విచారణ అనంతరం మీడియాతో మాట్లాడుతూ దానం నాగేందర్‌పై అనర్హత వేటు వేయాలని సభాపతిని కోరామన్నారు. ఖైరతాబాద్ నియోజకవర్గానికి ఉప ఎన్నిక జరగాలని విన్నవించామని కౌశిక్ రెడ్డి అన్నారు. బీజేపీ, కాంగ్రెస్ ఒక్కటేనని వారి మధ్య మ్యాచ్ ఫిక్సింగ్ ఉందని అన్నారు. ప్రజాప్రతినిధినైన తనపై వీణవంకలో పోలీసులు ప్రవర్తించిన తీరుపై స్పీకర్‌కు ఫిర్యాదు చేశానని కౌశిక్ రెడ్డి తెలిపారు. ఫిర్యాదుపై సభాపతి సానుకూలంగా స్పందించారని పేర్కొన్నారు. ప్రజాప్రతినిధి అయిన తనను పోలీసులు అధికారులు ఇబ్బంది పెట్టారని కౌశిక్ రెడ్డి ఆరోపించారు. తెలంగాణ శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌కు సుప్రీంకోర్టు ఇటీవల నోటీసులను చేసింది. పార్టీ ఫిరాయింపుల వ్యవహారంలో స్పీకర్‌పై భారతీయ జనతా పార్టీ నేత ఏలేటి మహేశ్వరరెడ్డి కోర్టు ధిక్కరణ వ్యాజ్యాన్ని దాఖలు చేశారు. పార్టీ ఫిరాయింపుల వ్యవహారంలో సుప్రీం తీర్పు అమలు చేయలేదని కొద్ది రోజుల క్రితం పిటిషన్ వేశారు. పిటిషన్‌పై విచారణ చేపట్టిన సుప్రీంకోర్టు మహేశ్వర్‌రెడ్డి పిటిషన్‌పై సమాధానం చెప్పాలని స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌కు నోటీసులను జారీ చేసింది. సుప్రీంకోర్టు ఆదేశాల నేపథ్యంలోనే ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్లపై స్పీకర్ విచారణ చేపట్టారు. పార్టీ మారినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న శాసనసభ్యుల్లో ఖైరతాబాద్ నుంచి దానం నాగేందర్, స్టేషన్ ఘన్ పూర్ నుంచి కడియం శ్రీహరి, భద్రాచలం నుంచి తెల్లం వెంకట్రావు, బాన్సువాడ నుంచి పోచారం శ్రీనివాస్ రెడ్డి, రాజేంద్రనగర్ నుంచి టి.ప్రకాష్ గౌడ్, చేవెళ్ల నుంచి కాలే యాదయ్య, జగిత్యాల నుంచి డాక్టర్ సంజయ్ కుమార్, శేరిలింగంపల్లి నుంచి ఆరెకపూడి గాంధీ, గద్వాల నుంచి బండ్ల కృష్ణ మోహన్ రెడ్డి, పటాన్ చెరు నుంచి జి.మహిపాల్ రెడ్డి ఉన్నారు. ఈ 10 మందిపై అనర్హత వేటు వేయాలని బీఆర్ఎస్ నాయకులు సభాపతికి ఫిర్యాదు చేశారు. ఆ ఫిర్యాదుపై స్పీకర్ సకాలంలో స్పందించి చర్యలు తీసుకోలేదని బీఆర్ఎస్ నాయకులు హైకోర్టును ఆశ్రయించారు. బీఆర్ఎస్ పార్టీ నాయకులు ఫిర్యాదు చేసిన ఎమ్మెల్యేలపై విచారణ చేపట్టాలని హైకోర్టు స్పీకర్ ప్రసాద్ కుమార్‌కు సూచించింది. ఈ ఉత్తర్వులతో సంతృప్తి చెందని బీఆర్ఎస్ నాయకులు కొద్ది రోజుల క్రితం సుప్రీంకోర్టును ఆశ్రయించారు.

సీఎం రేవంత్ మాటలు చర్యలు పొంతన లేవు

ప్రజల బ్రతుకులు బాగుపడాలంటే బీజేపీకి ఓటు వేయాలి: రాంచందర్ రావు

జగిత్యాల, జనవరి 30 (ప్రజా మంటలు) : జగిత్యాల జిల్లా కేంద్రంలోని ఒక ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన బీజేపీ మున్సిపల్ ఎన్నికల విజయ శంఖారావం కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలపై తీవ్ర విమర్శలు చేశారు. సీఎం రేవంత్ రెడ్డి మాటలకు, చర్యలకు పొంతన లేదని ఆయన అన్నారు.కేసీఆర్‌ను 100 రోజుల్లో జైలుకు పంపిస్తానన్న సీఎం హామీ అమలుకాలేదని, ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో నోటీసులు ఇవ్వడానికే పరిమితమయ్యారని విమర్శించారు. నోటుకు ఓటు కేసులో పరస్పర రక్షణ ఒప్పందం ఉందని ఆరోపిస్తూ, కాంగ్రెస్‌బీఆర్ఎస్ పార్టీల మధ్య అంతర్గత అవగాహన ఉందన్నారు. రెండు పార్టీలూ అవినీతి కుంభకోణాల్లో భాగస్వాములేనని వ్యాఖ్యానించారు.బీఆర్ఎస్ పార్టీ మునిగిపోతున్న పడవగా మారిందని, ఎంపీ, ఎమ్మెల్సీ, సర్పంచ్ ఎన్నికల్లో ప్రజలు ఇప్పటికే తిరస్కరించారని తెలిపారు. ప్రజల బ్రతుకులు బాగుపడాలంటే మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీకి ఓటు వేయాలని, మోడీ సహకారంతో జగిత్యాల అభివృద్ధిని చూపిస్తామని పిలుపునిచ్చారు.అనంతరం నిజామాబాద్ ఎంపీ అరవింద్ మాట్లాడుతూడ జగిత్యాలలో రాజకీయంగా తీవ్రమైన గందరగోళం నెలకొందని అన్నారు. ఎమ్మెల్యే సంజయ్ ఏ పార్టీకి చెందినవారో తనకే తెలియడం లేదని వ్యాఖ్యానించారు. సీఎం రేవంత్ రెడ్డి ఎమ్మెల్యే సంజయ్ ఏ పార్టీలో ఉన్నారో చెప్పగలిగితే తాను రాజకీయాలు వదులుతానని సవాల్ విసిరారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ రెండూ ఒక్కటేనని విమర్శించారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు భోగ శ్రావణి మాట్లాడుతూడ ఎమ్మెల్యే సంజయ్ గెలిచినా, ఓడినా అధికారంలో ఉన్న పార్టీలోనే ఉంటున్నారని విమర్శించారు. మున్సిపల్ ఎన్నికల్లో ఏ పార్టీకి ఓటు అడుగుతారో ప్రజలకు చెప్పాలని ప్రశ్నించారు.ఈ కార్యక్రమంలో జగిత్యాల జిల్లాకు చెందిన వ్యాపారవేత్తలు కొండా అరుణలక్ష్మణ్, ఆరుముళ్ల హరి, పుప్పాల శ్రీనివాస్ బీజేపీలో చేరారు. వారికి పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

కార్యక్రమంలో పాల్గొన్నవారు : బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు, నిజామాబాద్ ఎంపీ అరవింద్, రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు భోగ శ్రావణి, మాజీ ఎంపీ బోర్లకుంట వెంకటేష్ నేత, జిల్లా అధ్యక్షుడు రాంచకొండ యాదగిరి బాబు, ఇతర జిల్లా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సికింద్రాబాద్‌లో కాంగ్రెస్ కాగడాల ర్యాలీ

గాంధీ పేరు తొలగింపుపై కేంద్రానికి హెచ్చరిక

సికింద్రాబాద్, జనవరి 30 (ప్రజామంటలు) : గ్రామీణ ఉపాధి హామీ పథకం నుంచి మహాత్మా గాంధీ పేరు తొలగించిన కేంద్ర ప్రభుత్వ నిర్ణయాన్ని నిరసిస్తూ సికింద్రాబాద్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో శుక్రవారం కాగడాల ర్యాలీ నిర్వహించారు. నామలగుండు నుంచి సీతాఫలమండి మీదుగా చిలకలగూడ గాంధీ విగ్రహం వరకు ఈ ర్యాలీ కొనసాగింది.ఈ కార్యక్రమానికి తెలంగాణ కాంగ్రెస్ ఇన్‌చార్జ్ సచిన్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. డీసీసీ అధ్యక్షులు దీపక్ జాన్, కంటెస్టెడ్ ఎమ్మెల్యే ఇన్‌చార్జ్ అదం సంతోష్ కుమార్ అధ్యక్షత వహించారు.ఈ సందర్భంగా సచిన్ మాట్లాడుతూ... గ్రామీణ ఉపాధి హామీ పథకం నుంచి గాంధీ పేరు తొలగించడం దేశ చరిత్రను, విలువలను అవమానించడమేనని విమర్శించారు. "గాంధీజీ పేరు తీసేస్తే పేదల జీవితం మారిపోతుందా? ఇది కేవలం పేరు కాదుడ పేదల హక్కు ఉపాధికి హామీ. కేంద్ర ప్రభుత్వ నిర్ణయాన్ని కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా ఖండిస్తోంది" అని అన్నారు.అలాగే బీజేపీ ప్రభుత్వం తీసుకువచ్చిన బీబీ జీ రామ్‌జీ చట్టాన్ని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ, ఈ చట్టాలు ప్రజలకు వ్యతిరేకమని పేర్కొన్నారు.అదం సంతోష్ కుమార్ మాట్లాడుతూ.. మహాత్మా గాంధీ ఆశయాలే కాంగ్రెస్ పార్టీకి మార్గదర్శకమని, పేదల హక్కులను కాలరాస్తే కాంగ్రెస్ పార్టీ రోడ్లపైకి వచ్చి పోరాడుతుందని స్పష్టం చేశారు.ర్యాలీ సందర్భంగా కరపత్రాలు పంపిణీ చేసి ప్రజలకు అవగాహన కల్పించారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, యువజన కాంగ్రెస్, మహిళా కాంగ్రెస్, ఎస్సీ,ఎస్టీ సెల్ నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొని కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కాగడాల ర్యాలీ విజయవంతంగా ముగిసింది.

మారేడు ఆకుపై అమ్మవార్లు

ఆకుపై సమ్మక్కసారక్క చిత్రణతో ఆకట్టుకున్న జగిత్యాల చిత్రకారుడు

జగిత్యాల, జనవరి 30 (ప్రజా మంటలు) : జగిత్యాలకు చెందిన చిత్రకారుడు, కళాశ్రీ గుండేటి రాజు తన ప్రత్యేక కళా నైపుణ్యంతో మరోసారి అందరి ప్రశంసలు అందుకున్నారు. పవిత్రమైన మారేడు ఆకుపై సమ్మక్కసారక్క అమ్మవార్ల ప్రతిమలను తన కుంచెతో అద్భుతంగా చిత్రీకరించి భక్తుల మనసులు గెలుచుకున్నారు.శుక్రవారం సమ్మక్కసారక్క ఇద్దరూ గద్దెపై కొలువుదీరిన సందర్భంగా, అపారమైన భక్తితో ఈ చిత్రాన్ని ఆకుపై గిసినట్లు గుండేటి రాజు తెలిపారు. సంప్రదాయానికి ప్రతీకగా భావించే మారేడు ఆకును మాధ్యమంగా తీసుకుని అమ్మవార్ల రూపాలను చిత్రించడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.ఈ కళాఖండాన్ని చూసిన పలువురు పట్టణవాసులు, కళాభిమానులు చిత్రకారుడిని అభినందనలు తెలియజేశారు. సంప్రదాయం, భక్తి, కళను ఏకం చేస్తూ గుండేటి రాజు చేసిన ఈ ప్రయత్నం జగిత్యాలలో విశేష ప్రశంసలు పొందుతోంది.

కాంగ్రెస్ పార్టీ జెండా మోసిన నాయకులకే ప్రజలు మద్దతు ఇవ్వాలి: జీవన్ రెడ్డి

అవకాశవాదులను తరిమికొట్టాలి మున్సిపల్ ఎన్నికల సందర్భంగా పిలుపు

జగిత్యాల, జనవరి 30 (ప్రజా మంటలు) : జగిత్యాల పట్టణంలో జరుగుతున్న మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో పలు వార్డులలో కౌన్సిలర్‌గా నామినేషన్ వేస్తున్న అభ్యర్థులు మాజీ మంత్రి తాటిపర్తి జీవన్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా జీవన్ రెడ్డి మాట్లాడుతూడ దశాబ్దాల కాలంగా కాంగ్రెస్ పార్టీ జెండాను మోస్తూ ప్రజల కోసం పని చేసిన నిజమైన నాయకులనే గెలిపించాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వం ఏర్పడిన వెంటనే అధికారం కోసం అవకాశవాదులు ముందుకు వస్తున్నారని, ఊసరవెల్లిలా రంగులు మారుస్తూ ప్రజలను మోసం చేసే వారిపై అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు.గతంలో జరిగిన తప్పిదాలు మళ్లీ పునరావృతం కాకుండా ప్రజలు జాగ్రత్త వహించాలని సూచించారు. పార్టీకి నిబద్ధంగా పని చేసిన నాయకులకే ప్రజలు అండగా నిలవాలన్నారు.తాను అభ్యర్థుల వెంట ఎల్లప్పుడూ ఉంటానని, అవకాశవాదులను వదిలే ప్రసక్తే లేదని మాజీ మంత్రి తాటిపర్తి జీవన్ రెడ్డి స్పష్టం చేశారు. కాంగ్రెస్ పార్టీని బలపరిచే దిశగా అందరూ కలిసికట్టుగా పని చేయాలని ఆయన కోరారు.

కౌశిక్ రెడ్డి వ్యాఖ్యలు సిగ్గుచేటు

జిల్లా కాంగ్రెస్ మైనారిటీ విభాగం

కరీంనగర్, జనవరి 30 (ప్రజా మంటలు) : హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి వీధి రౌడీలా మాట్లాడటం సిగ్గుచేటని జిల్లా కాంగ్రెస్ మైనారిటీ విభాగం మండిపడింది. జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో జరిగిన ప్రెస్‌మీట్‌లో మైనారిటీ చైర్మన్ మొహమ్మద్ తాజోద్దిన్ ఈ వ్యాఖ్యలు చేశారు.వీణవంకలో సమ్మక్కసారలమ్మ జాతర సందర్భంగా హైకోర్టు ఆదేశాలను అతిక్రమించి, పోలీసులపై దురుసుగా వ్యవహరించడమే కాకుండా జిల్లా సీపీ గౌస్ ఆలంను కులం పేరుతో దూషించడం ముస్లిం సమాజాన్ని కించపరచడమేనన్నారు. ఎమ్మెల్యేపై కఠిన చర్యలు తీసుకుని కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు.ఈ సమావేశంలో కాంగ్రెస్ మైనారిటీ నాయకులు నేహాల్ అహ్మద్, లయీక్ ఖాద్రీ, అబ్దుల్ రహ్మాన్, మొహమ్మద్ కలిమొద్దీన్, ఆరిఫ్ ఖాన్, సయ్యద్ కరీం పాల్గొన్నారు.

అగ్ని ప్రమాద బాధితులను పరామర్శించిన మంత్రి అడ్లూరి

ప్రభుత్వ పరంగా అన్ని విధాల ఆదుకుంటాం

గొల్లపల్లి, జనవరి 30 (ప్రజా మంటలు) : ధర్మపురి పట్టణంలో ఇటీవల అగ్ని ప్రమాదానికి గురైన స్టార్ బిర్యాణి సెంటర్‌ను రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ శుక్రవారం సందర్శించారు. ఘటన వివరాలను బాధితుల నుంచి తెలుసుకున్నారు.గతంలో కూడా యాజమానికి చెందిన టెంట్ సామగ్రి అగ్ని ప్రమాదంలో నష్టపోయిందని, ఇప్పుడు బిర్యాణి సెంటర్ పూర్తిగా ఖాళీ కావడం వెనుక ఏమైనా కుట్ర ఉందా అనే కోణంలో విచారణ చేపట్టాలని ధర్మపురి సీఐ రామ్ నర్సింహారెడ్డిని మంత్రి ఆదేశించారు. రెండు ఘటనల్లో కలిపి సుమారు రూ.30 లక్షల ఆస్తి నష్టం జరిగినట్లు తెలిపారు.బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం అన్ని విధాల ఆదుకుంటుందని హామీ ఇచ్చిన మంత్రి, ట్రాన్స్‌కో సీఎండీతో ఫోన్‌లో మాట్లాడి ఆర్థిక సహాయం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సంగం బట్ల దినేష్‌తో పాటు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అమ్మవార్ల ఆశీస్సులతో పాడి పంటలు పండాలి

సమ్మక్క సారలమ్మకు మాజీ ఎమ్మెల్యే ప్రవీణ్ రెడ్డి ప్రత్యేక పూజలు

భీమదేవరపల్లి, జనవరి 30 (ప్రజా మంటలు) : మండలంలోని ముల్కనూర్ గ్రామంలో నిర్వహిస్తున్న సమ్మక్క సారలమ్మ జాతర సందర్భంగా హుస్నాబాద్ నియోజకవర్గం మాజీ శాసనసభ్యులు అలిగిరెడ్డి ప్రవీణ్ రెడ్డి గురువారం అమ్మవార్లను దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ముల్కనూర్ గ్రామంలో జరుగుతున్న సమ్మక్క సారలమ్మ జాతరకు ప్రత్యేక విశిష్టత ఉందని పేర్కొన్నారు. అమ్మవారి దయతో ఈ ప్రాంతంలో వర్షాలు సమృద్ధిగా కురిసి, పాడిపంటలతో ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ముల్కనూర్ గ్రామ సర్పంచ్ జాలి ప్రమోద్ రెడ్డి, సమ్మక్క కమిటీ చైర్మన్ జక్కుల ఐలయ్య, ఉప సర్పంచ్ కాసగోని మమత బాలకృష్ణ, మాజీ సర్పంచ్ మంగ రాంచంద్రం, ప్రెస్ కొమురయ్య, గోపి, సమ్మయ్య, శంకరయ్య, గణవేన శ్రీనివాస్, చింటూ, జక్కుల అనిల్ తదితరులు పాల్గొన్నారు.

సమ్మక్కసారలమ్మ స్ఫూర్తితో తెలంగాణ ప్రజల కోసం పోరాటం: కవిత

మేడారం, జనవరి 30 (ప్రజా మంటలు) : సమ్మక్కసారలమ్మలను దర్శించుకున్న అనంతరం తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత మీడియాతో మాట్లాడారు. తెలంగాణ ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని అమ్మవార్లను కోరుకున్నట్లు తెలిపారు.కాకతీయుల వంటి రాజులతో పోరాడిన వనదేవతలు సమ్మక్కసారలమ్మలు తమ జాతి కోసం నిలబడి పోరాడిన వీరవనితలని అన్నారు. గోవిందరాజు, పడిగిద్దరాజు వంశానికి చెందిన గొప్ప సైనికుల స్ఫూర్తితోనే తెలంగాణ ప్రజల కోసం తాము పోరాటం చేస్తున్నామని పేర్కొన్నారు.తెలంగాణ రాష్ట్రం ఏర్పడి 12 ఏళ్లు గడిచినా ఇంకా నీళ్లు, నిధులు, నియామకాలు అందని పరిస్థితి ఉందని, సామాజిక న్యాయం అందరికీ దక్కలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ పరిస్థితి మారేలా తెలంగాణ జాగృతి తరఫున తమ వంతు కృషి చేస్తామని కవిత స్పష్టం చేశారు.

'సడక్ సురక్ష జీవన్ రక్ష' నినాదంతో రోడ్డు భద్రత అవగాహన

రోడ్డు భద్రత నియమాలు తప్పనిసరిగా పాటించాలి : ఎంవిఐ కంచి వేణు

హుజురాబాద్, జనవరి 30 (ప్రజా మంటలు) : రోడ్డు ప్రమాదాలను నివారించి ప్రజల ప్రాణాలను కాపాడడమే లక్ష్యంగా జనవరి 1 నుండి 30, 2026 వరకు నిర్వహించిన రోడ్డు భద్రత మాసోత్సవాలు ఘనంగా ముగిశాయని హుజురాబాద్ వెహికల్ ఇన్స్పెక్టర్ కంచి వేణు తెలిపారు. రవాణా శాఖ ఆధ్వర్యంలో నెల రోజుల పాటు నిర్వహించిన ఈ అవగాహన కార్యక్రమాలు ఈ ఏడాది "సడక్ సురక్ష, జీవన్ రక్ష" అనే నినాదంతో కొనసాగాయి. ఈ సందర్భంగా బైక్ ర్యాలీలు, అవగాహన సదస్సులు, ట్రాఫిక్ నిబంధనల అమలుపై ప్రత్యేక దృష్టి సారించారు. మద్యం సేవించి వాహనాలు నడపకూడదని, ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, కార్లలో ప్రయాణించే వారు సీట్ బెల్ట్ వినియోగించాలని ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించారు. రోడ్డు ప్రమాదాలను 50 శాతం వరకు తగ్గించడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ఈ 31 రోజుల ప్రత్యేక ప్రణాళికను అమలు చేసిందని ఆయన పేర్కొన్నారు. ఈ మాసోత్సవాల్లో భాగంగా వాహనదారులకు కౌన్సెలింగ్, ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించిన వారిపై జరిమానాలు, పాఠశాలలు, కాలేజీల్లో విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. అదేవిధంగా బైక్ ర్యాలీలు, రక్తదాన శిబిరాలు, ఉచిత కంటి పరీక్షలు, డ్రైవర్లకు వైద్య పరీక్షలు కూడా చేపట్టారు. ఈ నెల రోజుల ప్రచారం వల్ల రోడ్డు భద్రతపై ప్రజల్లో గణనీయమైన అవగాహన పెరిగిందని అధికారులు తెలిపారు. రోడ్డు భద్రత అనేది కేవలం ఒక నెలకే పరిమితం కాకుండా ప్రతి రోజూ పాటించాల్సిన సామూహిక బాధ్యత అని హుజురాబాద్ వెహికల్ ఇన్స్పెక్టర్ కంచి వేణు స్పష్టం చేశారు.

అందుబాటులో పరిశీలకులు ఖర్డాడే కాళీచరణ్

జగిత్యాల, జనవరి 30 (ప్రజా మంటలు) : రెండవ సాధారణ మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో జగిత్యాల జిల్లా సాధారణ ఎన్నికల పరిశీలకులుగా ఖర్డాడే కాళీచరణ్ సుదామ రావును నియమించారు. ఆయన జగిత్యాల అతిథి గృహంలో సోమవారం నుంచి శుక్రవారం వరకు ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకు అందుబాటులో ఉంటారు.ఎన్నికలకు సంబంధించిన అంశాలపై ప్రజలు, ప్రజా ప్రతినిధులు నేరుగా అతిథి గృహంలో సంప్రదించవచ్చని అధికారులు తెలిపారు. అదేవిధంగా 7972697600 నంబర్‌లో ఫోన్ ద్వారా కూడా సంప్రదించవచ్చని పేర్కొన్నారు.

ఆధార్ సెంటర్ ఆపరేటర్స్ నిర్దేశించిన రుసుములను మాత్రమే తీసుకోవాలి అదనపు కలెక్టర్ బిఎస్ లత

జగిత్యాల జనవరి 30 (ప్రజా మంటలు) : జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరము లో శుక్రవారం రోజున జిల్లా కలెక్టర్, బి. సత్యప్రసాద్, ఆదేశాల క్రమము జిల్లా అదనపు కలెక్టర్ బిఎస్. లత జిల్లాలోని ఆధార్ సెంటర్ ఆపరేటర్స్ సమావేశం నిర్వహించడం జరిగింది. యు ఐ డి ఏ ఐ నిర్దేశించిన రుసుములను మాత్రమే తీసుకోవాలని ఎవరైనా అధిక రుసుము తీసుకున్నచో కఠిన చర్యలు తీసుకోబడునని సూచించడం జరిగింది. ఆధార్ ప్రైజ్ చార్ట్స్‌అండ్ సైన్ బోర్డ్స్ ఉండాలని మరియు ఆధార్ నమోదు మరియు సవరణలు చేసే సమయంలో నిర్దేశించిన డాక్యుమెంట్లను మాత్రమే అప్లోడ్ చేయాలని సూచించడం జరిగింది.యు ఐ డి ఏ ఐ ఆఫీస్ నిర్వహించే ఎన్ సి ఈ ఏ ఆర్ సర్వే లో అందరూ పాల్గొని ఫిబ్రవరి 5వ తేదీ వరకు పూర్తి చేయాలని ఆదేశించారు. ఇట్టి సమావేశంలో జగిత్యాల జిల్లా ఈ డి ఎం మమత, టి జి టి ఎస్ డిఎం చేతన్ మరియు జిల్లాలోని ఆధార్ సెంటర్ ఆపరేటర్లు పాల్గొనడం జరిగింది.

మున్సిపల్ ఎన్నికల నామినేషన్ కేంద్రాలను పర్యవేక్షించిన అదనపు ఎస్పీ శేషాద్రిని రెడ్డి

జగిత్యాల/ కోరుట్ల/ మెట్పల్లి జనవరి 30 (ప్రజా మంటలు) : మున్సిపల్ ఎన్నికల నామినేషన్ల దాఖలుకు చివరి రోజు కావడంతో, జగిత్యాల, కోరుట్ల,మెట్ పల్లి మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన నామినేషన్ కేంద్రాలను అదనపు ఎస్పీ శేషాద్రిని రెడ్డి క్షేత్రస్థాయిలో సందర్శించి భద్రతా ఏర్పాట్లను పర్యవేక్షించారు. విధుల్లో ఉన్న పోలీసు అధికారులు మరియు సిబ్బందికి భద్రతాపరమైన సూచనలు చేశారు.ఈ సందర్భంగా అదనపు ఎస్పీ మాట్లాడుతూ, నామినేషన్ కేంద్రాల పరిసరాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పట్టిష్ట బందోబస్తు ఏర్పాటు చేశామని అభ్యర్థులు మరియు వారి అనుచరులు ఎన్నికల ప్రవర్తనా నియమావళిని (ఎం సి సి) కచ్చితంగా పాటించాలని, నిబంధనలకు విరుద్ధంగా, శాంతిభద్రతల విఘాతానికి ప్రయత్నించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని అన్నారు.అదనపు ఎస్పీ వెంట డిఎస్పి రాములు, ఇన్స్పెక్టర్లు కరుణాకర్, అనిల్ కుమార్,మరియు ఎస్.ఐలు ఉన్నారు.

బ్రాహ్మణ కర్మా భవన్‌కు 121 గజాల స్థలం రిజిస్ట్రేషన్

భద్రకాళివేయి స్థంభాల ఆలయాల్లో పూజలు

హన్మకొండ, జనవరి 30 (ప్రజా మంటలు) : విప్ర ఫౌండేషన్ ఆధ్వర్యంలో బ్రాహ్మణ కర్మా భవన్ నిర్మాణానికి సంబంధించిన 121 గజాల స్థలాన్ని శుక్రవారం రిజిస్ట్రేషన్ చేయించారు. ఈ సందర్భంగా హన్మకొండ వేయి స్థంభాల దేవాలయం, వరంగల్ భద్రకాళి అమ్మవారి ఆలయాల్లో రిజిస్ట్రేషన్ పత్రాలకు పూజలు నిర్వహించారు.ఫౌండేషన్ ఛైర్మన్ వల్లూరి పవన్ కుమార్ మాట్లాడుతూడ దీర్ఘకాలిక ప్రయోజనాల దృష్ట్యా శాశ్వత ప్రాతిపదికన (లీజ్ లేకుండా) భూమి రిజిస్ట్రేషన్ చేపట్టామని తెలిపారు. అన్ని బ్రాహ్మణ సంఘాల సమన్వయంతో, శాఖాభేదం లేకుండా పేద బ్రాహ్మణులకు ఉపయోగపడేలా కర్మా భవన్‌ను నిర్మిస్తామని చెప్పారు.ఈ కార్యక్రమంలో బ్రాహ్మణ ప్రతినిధులు గంగు ఉపేంద్ర శర్మ, చింతలపల్లి గణపతి శర్మ, గుళ్లపల్లి జయప్రసాద్ రావు, కొయ్యడ రామచంద్ర మూర్తి, మేడ్చర్ల ధర్మేందర్ రావు, యరబాటి జ్యోతి, మాడపాటి లక్ష్మి ప్రియ, విన్నకోట రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రాజారాంపల్లి సమ్మక్క సారలమ్మ లనుదర్శించుకున్న మంత్రి అడ్లూరి

ఎత్తు బంగారం సమర్పించిన మంత్రి అడ్లూరి

గొల్లపల్లి జనవరి 30 ప్రజా మంటలు : ఎండపల్లి మండలం రాజారాం పల్లి లోని సమ్మక్క సారలమ్మ జాతర లో మంత్రి లక్ష్మణ్ కుమార్ శుక్రవారం పాల్గొన్నారు మంత్రి లక్ష్మణ్ కుమార్ కు జాతర కమిటీ సభ్యులు, గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు.రాజా రాంపల్లిలో సమ్మక్క సారలమ్మ లకు మంత్రి లక్ష్మణ్ కుమార్ ఎత్తు బంగారం సమర్పించుకున్నారు. రాజారాంపల్లి అభివృద్ధికి రూపాయలు 10 లక్షలు నిధులు కేటాయిస్తానని మంత్రి లక్ష్మణ్ కుమార్ ఈ సందర్భంగా కమిటీ సభ్యులకు హామీ ఇచ్చారు ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు శైలజ రెడ్డి నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

త్రికూటేశ్వరాలయంలో మహాశివరాత్రి జాతర

ఫిబ్రవరి 14,15,16 మూడు రోజుల ఉత్సవాలు

భీమదేవరపల్లి జనవరి 30 (ప్రజా మంటలు) : మండలంలోని ముత్తారం ప్రాచీన కాకతీయుల కట్టడం శ్రీ త్రికూటేశ్వరాలయంలో మహాశివరాత్రి జాతర ఉత్సవాలు ఫిబ్రవరి 14 నుంచి 16 వరకు అంగరంగ వైభవంగా నిర్వహించనున్నట్లు టిటిడిఎస్ (త్రికుటేశ్వరాలయం టెంపుల్ డెవలప్మెంట్ సొసైటీ) చైర్మన్ కాశిరెడ్డి ఆదిరెడ్డి తెలిపారు. ఫిబ్రవరి 14 న, శనివారం గణపతి పూజ, అఖండ దీపారాధనతో ఉత్సవాలు ప్రారంభమవుతాయి. 15 న, ఆదివారం జాతర సందర్భంగా రుద్రాభిషేకాలు, సాంస్కృతిక కార్యక్రమాలు, రాత్రి శివపార్వతుల కళ్యాణం, లింగోద్భవ జలాభిషేకం జరుగుతాయి. 16 న, సోమవారం మహా మృత్యుంజయ హోమం, మహా అన్నప్రసాద వితరణ, ఉత్సవమూర్తుల ఊరేగింపుతో కార్యక్రమాలు ముగుస్తాయని తెలిపారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని ఆలయ కమిటీ విజ్ఞప్తి చేసింది.

నామినేషన్లను సజావుగా సాగే విధంగా చూడాలి

ఎన్నికల ప్రవర్తన నియమావాళిని పాటించాలి

స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ బి. రాజ గౌడ్

రాయికల్ జనవరి 30 (ప్రజా మంటలు) : రాయికల్ మున్సిపాలిటీలో జరుగుతున్న నామినేషన్ల ప్రక్రియను స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ బి.రాజ గౌడ్ పరిశీలించారు.ఈ సందర్భంగా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ బి. రాజ గౌడ్ మాట్లాడుతూ నామినేషన్ కేంద్రాలను తనిఖీ చేసి నామినేషన్ ఫారాలు, రిజిస్టర్లను పరిశీలించారు. ఆయా వార్డులకు దాఖలైన నామినేషన్ల వివరాలను అడిగి తెలుసుకున్నారు. నామినేషన్ల స్వీకరణ, స్క్రూటిని, అప్పీళ్ల పరిష్కారం, గుర్తుల కేటాయింపు, పోటీ చేసే అభ్యర్థుల ప్రకటన తదితర ప్రక్రియలు సజావుగా జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. దాఖలైన నామినేషన్ల వివరాలను జాగ్రత్తగా పరిశీలించి వెంట వెంటనే రోజు వారీగా టీ. పోల్ యాప్ లో అప్ లోడ్ చేయాలని అన్నారు. అభ్యర్థులు అన్ని వివరాలతో నామినేషన్ పత్రాలను దాఖలు చేసేలా హెల్ప్ డెస్క్ ద్వారా అవగాహన కల్పించాలని, వారి సందేహాలు నివృత్తి చేయాలని అన్నారు. ఎన్నికల సంఘం నిబంధనలను పక్కాగా పాటిస్తూ పారదర్శకంగా ఎన్నికలు నిర్వహించుటకు సమన్వయంతో పని చేయాలని తెలిపారు.ఈ పరిశీలనలో రాయికల్ మున్సిపల్ కమిషనర్ నాగరాజు, రిటర్నింగ్ అధికారులు, ఎన్నికల సిబ్బంది మరియు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో పలుచోట్ల ఏసీబీ మెరుపు దాడులు

స్వాధీనం చేసుకున్న బంగారు, వెండి వస్తువులు

రేణిగుంట సబ్‌రిజిస్ట్రార్ ఆఫీసు ఉద్యోగి తిరుమలేశ్ అరెస్టు

నెల్లూరు జిల్లా దగదర్తి తహశీల్దారు పాల కృష్ణ ఇళ్లలో సోదాలు

పాల కృష్ణ నివాసంతో పాటు బంధువుల ఇళ్లలో ఏసీబీ తనిఖీలు

ఆదాయానికి మించి ఆస్తులకు సంబంధించిన ఫిర్యాదులపై రాష్ట్ర అవినీతి నిరోధక శాఖ ప్రత్యేక దృష్టి సారించింది. అవినీతికి పాల్పడే వ్యక్తులు, సంస్థలపై నిరంతరం నిఘా ఉంచడమే తమ ప్రధాన లక్ష్యమని ఏసీబీ డైరెక్టర్ జనరల్ అతుల్ సింగ్ గతేడాది కేసుల సమీక్ష అనంతరం వెల్లడించారు. దానికి తగినట్లుగానే 2026 ప్రారంభం నుంచి తమకు వచ్చిన ఫిర్యాదులను నిశితంగా పరిశీలిస్తోంది.గురువారం రెండు చోట్ల ఆదాయానికి మించిన ఆస్తుల కేసులు నమోదు చేసిన ఏసీబీ శుక్రవారం తెల్లవారుజాము నుంచి క్షేత్రస్థాయిలో తనిఖీలు జరుపుతోంది. నెల్లూరు జిల్లా దగదర్తి తహశీల్దారు పాల కృష్ణ ఇళ్లలో ఓ బృందం సోదాలు నిర్వహిస్తోంది. నెల్లూరు జిల్లాలోని పాల కృష్ణ నివాసంతో పాటు బంధువులు, ఇతరులకు చెందిన 8 ప్రాంతాల్లో తనిఖీలు జరుపుతున్నారు.నగదు, బంగారం, వెండి ఆభరణాలతో పాటు పలు డాక్యుమెంట్లను గుర్తించినట్లు సమాచారం. మరో ఫిర్యాదుపై న్యాయశాఖకు చెందిన ఉద్యోగుల ఇళ్లలోనూ సోదాలు చేస్తున్నారు. గుంటూరు, ఎన్టీఆర్, కృష్ణా జిల్లాల్లోని 5 చోట్ల తనిఖీలు చేస్తున్నట్లు ఏసీబీ ప్రధాన కార్యాలయం పేర్కొంది. తాజా సోదాలకు సంబంధించి మధ్యాహ్నం తర్వాత స్పష్టమైన వివరాలు బయటకొచ్చే అవకాశం ఉంది.తిరుపతి జిల్లా రేణిగుంటలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో పనిచేస్తూ సస్పెన్షన్‌కు గురైన ఆఫీస్ సబార్డినేట్ తిరుమలేశ్ ఆదాయానికి మించి ఆస్తులు కలిగి ఉన్నట్లు అవినీతి నిరోధక శాఖ గుర్తించింది. ఈ మేరకు ఏసీబీ అదనపు ఎస్పీ విమలకుమారి పర్యవేక్షణలో 3 బృందాలు తిరుపతి, నెల్లూరులోని 6 ప్రాంతాల్లో సోదాలు నిర్వహించాయి.రేణిగుంట సబ్‌రిజిస్ట్రార్ ఆఫీసు ఉద్యోగి తిరుమలేశ్ అరెస్టు : తిరుపతి రామచంద్రనగర్‌లోని శ్రీలక్ష్మీ నివాస్ అపార్ట్‌మెంట్లో తిరుమలేశ్ సమక్షంలో ఓ బృందం తనిఖీలు చేసింది. చైతన్యపురంలో జీ ప్లస్ త్రీ భవనం, తిరుచానూరు పరిధిలో 2 స్థలాలతో పాటు మరో 2 ఆస్తుల పత్రాలను గుర్తించారు. నివాసం ఉంటున్న అపార్ట్‌మెంట్‌తో పాటు భూములు, భవనాలకు సంబంధించిన పత్రాలను స్వాధీనం చేసుకున్నారు. అక్కడ రూ.15.26 లక్షల నగదు, కిలో 400 గ్రాముల బంగారు, 8 కిలోల 700 గ్రాముల వెండి సామగ్రిని గుర్తించారు. కారు, 3 ద్విచక్ర వాహనాలు, విలువైన గృహోపకరణాలు సోదాల్లో బయటపడ్డాయి.రెండు బ్యాంకు లాకర్లలో నగదు, ఆభరణాలను మదింపు చేయనున్నారు. తిమ్మినాయుడుపాళెంలోని అతని సన్నిహితుల అపార్ట్‌మెంట్లోనూ సోదాలు జరిపారు. అక్కడ కిలో బంగారు ఆభరణాలు, 4 కిలోల వెండి సామగ్రి గుర్తించారు. నగరంలోని గిరిపురంలోని సొంతింటితో పాటు మరో ఇంటిలోనూ నెల్లూరు జిల్లా మర్రిపాడు మండలంలోని డీసీపల్లిలోని రెండు ప్రాంతాల్లోనూ తనిఖీలు చేశారు. అక్కడ నిర్మాణంలో ఉన్న జీ ప్లస్ త్రీ భవనానికి సంబంధించిన పత్రాలను గుర్తించారు. ఈ ఆస్తుల విలువ సుమారు రూ.50 కోట్లు ఉంటుందని ఏసీబీ అధికారులు అంచనా వేశారు. సంబంధిత పత్రాలు, బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. తిరుమలేశ్‌ను అరెస్టు చేసిన అధికారులు నేడు ఏసీబీ కోర్టుకు తరలించనున్నారు.

అమరావతి నగర నిర్మాణం ఓ అరుదైన అవకాశం

కొత్త నగరాన్ని అద్భుతంగా తీర్చిదిద్దుకోవచ్చు, ఆంధ్రప్రదేశ్‌లో

అభివృద్ధి చెందుతున్న అమరావతి అందుకు ఉదాహరణ

ఇది సులభతర జీవనానికి భవిష్యత్ నగరం: ఆర్థిక సర్వే

ఆర్థిక సర్వే(2025-26) ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రాజధాని అమరావతి నగర నిర్మాణం ఒక అరుదైన అవకాశమని పేర్కొంది. ఇది సులభతర జీవనానికి భవిష్యత్ నగరంగా నిలుస్తుందని తెలిపింది. ఒక నగరం కిక్కిరిసిపోయాక, సేవల కొరత ఏర్పడ్డాక, అనధికార నిర్మాణాలు పెరిగాక మార్పులు, చేర్పులు చేయడం కంటే గ్రీన్‌ఫీల్డ్ నగరం ఏర్పాటు ద్వారా అక్కడి జీవన వ్యవస్థని ముందు నుంచే ప్రణాళికాబద్ధంగా డిజైన్ చేసుకునే అవకాశం ఉంటుందని వివరించింది.భారీ మౌలిక సౌకర్యాలపై ఆధారపడే నగరాలకంటే విద్య, ఇతర రంగాల అనుసంధానంతో ఏర్పడే నగరాలే వేగంగా వృద్ధి చెందుతాయని స్పష్టం చేసింది. కొత్త నగరాన్ని అద్భుతంగా తీర్చిదిద్దుకోవచ్చని, ఆంధ్రప్రదేశ్‌లో అభివృద్ధి చెందుతున్న అమరావతిని అందుకు ఉదాహరణగా ఆర్థిక సర్వే పేర్కొంది.దేశంలోనే 10 నివాస యోగ్య నగరాల్లో తిరుపతి, విజయవాడ: జీవన సౌలభ్య సూచీల్లో దేశంలో అగ్రస్థానంలో ఉన్న పది నగరాల్లో ఆంధ్రప్రదేశ్‌లోని తిరుపతి, విజయవాడ నగరాలకు స్థానం దక్కింది. బెంగళూరు, దిల్లీ, ముంబయి నగరాల్లాగా తిరుపతి, విజయవాడ తీవ్రమైన జనాభా ఒత్తిడిని ఎదుర్కోవడం లేదని ఆర్థిక సర్వే వెల్లడించింది. ఇక్కడ నగరీకరణ జరుగుతోందని.. మౌలిక సౌకర్యాలు, ఉద్యోగావకాశాలు సులభంగా లభిస్తాయని వెల్లడించింది.

అగ్రస్థానంలో ఉన్న నగరాలు ఇవేః

పుణె,నవీ ముంబయి,గ్రేటర్ ముంబయి,తిరుపతి,చండీగఢ్,థాణె ,రాయ్‌పుర్,ఇండోర్,విజయవాడ,భోపాల్,నివాస యోగ్య నగరాలంటే: ప్రపంచంలో జీవన సౌలభ్యం కలిగిన నగరాలన్నీ కొత్తవి, ధనికమైనవి కావని, రోజువారీ జీవనంలో ఇబ్బందుల్ని తగ్గించి ప్రజల వ్యక్తీకరణకు అవకాశం కల్పించేవని ఆర్థిక సర్వే వివరించింది. రోజూ ప్రజల భాగస్వామ్యాన్ని ప్రోత్సహించే నగరాలే నిజమైన నివాసయోగ్య నగరాలుగా వర్ణించింది. మౌలిక సౌకర్యాల కల్పనకే పరిమితం కాకుండా.. ప్రజల సమయం, వారి ఎంపికలు, సృజనాత్మకతను గౌరవించేలా ఉంటేనే అసలైన జీవనయోగ్యత సాకారమవుతుందని తెలిపింది.ఉదాహరణ: డెట్రాయిట్‌లో జాతీయ రహదారులు, పరిశ్రమలు, స్టేడియాల నిర్మాణానికి పెద్దఎత్తున పెట్టుబడులు పెట్టారు. కానీ ఆర్థిక ఉత్పాదకత పరంగా ఆ పెట్టుబడులకు తగ్గ ఫలితం సాధించలేదు. ఫలితంగా అక్కడ జనాభా తగ్గిపోయింది.బోస్టన్‌లో మౌలిక సౌకర్యాలు పరిమితంగా ఉన్నా విద్యాసంస్థలు, విశ్వవిద్యాలయాలు ఎక్కువ. అవే నగరాన్ని ఆర్థిక, విద్య, బయోటిక్ తదితర ఆధునిక రంగాల దిశగా నడిపించాయి. బెంగళూరులో దిల్లీ, ముంబయితో పోలిస్తే మౌలిక సౌకర్యాలు తక్కువే. ఇంజినీరింగ్ ప్రతిభ, వ్యవస్థాపక పర్యావరణ వ్యవస్థ కారణంగానే భారతదేశ సిలికాన్ వ్యాలీగా ఎదిగింది.జీవన సౌలభ్య సూచీకి ప్రధానాంశాలు: విద్య, ఆరోగ్యం, హౌసింగ్, నీరు, పారిశుద్ధ్యం, వ్యర్థాల నిర్వహణ, రవాణా, భద్రత, వినోదం తదితర అంశాల్ని ప్రామాణికంగా తీసుకుంటారు. వాటి ఆధారంగా నగరాల్లో జీవన నాణ్యతను కొలుస్తారు.ఇదిలా ఉండగా మరోవైపు ఏపీ రాజధాని నగరం అమరావతి అభివృద్ధి అన్నది జాతీయ, ప్రాంతీయ ప్రాధాన్యమున్న అంశమని తమిళనాడు ఎంపీ (ఏఐఏడీఎంకే) ఎం.తంబిదురై నేతృత్వంలోని రాజ్యసభ హామీల కమిటీ పేర్కొన్న సంగతి తెలిసిందే. రాజధాని అభివృద్ధి అన్నది జాతీయంగా, ప్రాంతీయంగా చాలా ప్రాధాన్యమున్న అంశం.

టిప్‌టాప్‌గా రెడీ అవుతారు - క్షణాల్లో దోచేసి మాయమవుతారు!

దిల్లీలో పోలీసుల నిఘా ఎక్కువ అవ్వడంతో

హైదరాబాద్‌కు మకాం మార్చిన దొంగలు

పోలీసుల కళ్లు గప్పి తిరుగుతున్న చైన్ స్నాచర్స్

సీసీ కెమెరాల ఆధారంగా చిక్కిన నిందితులు

దిల్లీకి చెందిన ఇద్దరు యువకులు టిప్‌టాప్‌గా రెడీ అయ్యి, డెలివరీ బాయ్స్‌గా పని చేస్తున్నారు. చూడటానికి చక్కగా ఉన్నా, వారితో చాలా జాగ్రత్తగా ఉండాలి. లేదంటే రెప్పపాటు కాలంలో మన చైన్ లాక్కుని వెళ్లిపోతారు. ఇలా ఒక్కరోజులోనే పలు చైన్ స్నాచింగ్‌లు చేసి, హైదరాబాద్ పోలీసుల దృష్టిలో పడ్డారు. అసలు వాళ్లు ఎవరు? ఎందుకు దిల్లీ నుంచి ఇక్కడికి వచ్చారు? అని ఇప్పుడు తెలుసుకుందాం.

డెలివరీ పనికి వచ్చే డబ్బులు సరిపోలేదని : ఈ నెల 17న హైదరాబాద్‌లో గంటల వ్యవధిలో పలుచోట్ల జరిగిన గొలుసు దొంగతనాలు కలకలం రేపాయి. ఈ కేసుల్ని హైదరాబాద్ పోలీసులు ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నారు. పోలీసుల కళ్లు గప్పి చైన్ స్నాచింగ్ చేసి తప్పించుకు తిరుగుతున్న ఇద్దరు పాత నేరస్థులను దిల్లీలో అరెస్ట్ చేశారు. దిల్లీలోని సాగర్‌పూర్ ప్రాంతానికి చెందిన అక్షయ్ కుమార్ శర్మ డెలివరీ బాయ్‌గా పనిచేసే వాడు. వచ్చే డబ్బులు సరిపోక దొంగతనాలు మొదలుపెట్టాడు. ఈ క్రమంలోనే రోహిత్ అనే వ్యక్తితో పరిచయం ఏర్పడింది. ఇద్దరు కలిసి దిల్లీలో చోరీలు చేసేవారు. దిల్లీలో పోలీసుల నిఘా ఎక్కువ అవ్వడంతో నిందితులిద్దరూ ఇతర రాష్ట్రాలకు మకాం మార్చారు.డెలివరీ బాయ్స్ ముసుగులో చైన్ స్నాచింగ్ - పోలీసుల అదుపులో దొంగలు (ఙుఎ)ఒకే రోజు మూడు చోట్ల చోరీలు : నిందితులు గతేడాది నవంబరులో హైదరాబాద్‌లోని నాచారం, జవహర్‌నగర్, శామీర్‌పేట పోలీస్‌స్టేషన్ల పరిధిలో చైన్ స్నాచింగ్‌లు చేసి పరారయ్యారు. అప్పుడు పోలీసులకు చిక్కలేదు. దీన్నే అదనుగా భావించి, ఈ నెల 17న నగరంలోని మరో మూడు చోట్ల గొలుసు దొంగతనాలు చేశారు. అప్రమత్తమైన పోలీసులు గాలింపు చర్యలు మొదలుపెట్టారు."అక్షయ్ కుమార్ శర్మ, రోహిత్‌లు ఇద్దరు దిల్లీకి చెందిన వారు. ఇప్పటి వరకు అక్షయ్ మీద 21 స్నాచింగ్ కేసులు, రోహిత్ మీద 13 కేసులు దిల్లీ, నాగ్‌పూర్, మహారాష్ట్రలో నమోదయ్యాయి. మన నగరంలో 9 కేసులు ఉన్నాయి. 17వ తారీఖున ఎల్బీనగర్ జోన్‌లో 3 చైన్ స్నాచింగ్‌లు, 1 అటెంప్ట్ కేసు నమోదైంది. వెంటనే కమిషనర్ ఆఫ్ పోలీస్ మల్కాజిగిరి సర్కిల్‌కు సమాచారం అందించి, 3 టీమ్‌లు ఏర్పాటు చేసి నిందితులను పట్టుకున్నాం. అలాగే ఎల్బీనగర్ ప్రాంతంలో ఇప్పటి వరకు పోయిన వాటిని రికవరీ చేశాం." - అనురాధ, ఎల్బీనగర్ డీసీపీ

180కి పైగా సీసీ కెమెరాలు : గొలుసు చోరీలపై దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు నిందితుల ద్విచక్రవాహనం ప్రయాణించిన మార్గాల్లోని దాదాపు 180కి పైగా సీసీ కెమెరాలు, సెల్‌ఫోన్ సిగ్నల్స్ ఆధారంగా వారిని గుర్తించారు. ఇటీవల దిల్లీకి వెళ్లిన పోలీసుల ప్రత్యేక బృందం నిందితుల్ని అదుపులోకి తీసుకున్నారు. పోలీసుల కళ్లు గప్పి నేరాలకు పాల్పడినప్పటికీ టెక్నాలజీ నుంచి నేరస్థులు తప్పించుకోలేకపోయారు.

పోలీసులకు దొరకమనే ధీమాతో : ఈ రోజుల్లో యువత తాము సంపాదించే డబ్బు సరిపోవడం లేదని తప్పుడు మార్గాలు ఎంచుకుంటున్నారు. దీనికి చెడు వ్యసనాలు కూడా తోడవుతున్నాయి. పోలీసులకు దొరకమనే ధీమాతో నేరాలకు పాల్పడుతున్నారు. కానీ పోలీస్ అధికారులు పెరిగిన టెక్నాలజీ కారణంగా అత్యంత వేగంగా దొంగలను పట్టుకుంటున్నారు. ఫలితంగా జీవితంలో గొప్పగా స్థిరపడాల్సిన వయస్సులో చాలా మంది ఇలా జైళ్లలో ఊచలు లెక్కపెడుతున్నారు.

మనమూ అప్రమత్తంగా ఉండాలి : అలాగే మహిళలు బంగారం ధరించి ఒంటరిగా బయటకు వెళ్లినప్పుడు జాగ్రత్తగా ఉండాలని పోలీసులు హెచ్చరిస్తున్నారు. ఎప్పుడైనా ఇటువంటి పరిస్థితి ఎదురైతే తక్షణమే పోలీసులను సంప్రదించాలని సూచిస్తున్నారు. ఈ మధ్య కాలంలో ఇలాంటి నేరాలు ఎక్కువగా అవుతున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని చెబుతున్నారు.

పీటీ ఉష భర్త కన్నుమూత

నిన్న అర్ధరాత్రి కన్నుమూసిన ఉష భర్త శ్రీనివాసన్

భారతదేశం గర్వించదగ్గ క్రీడాకారిణి, ఇండియన్ ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షురాలు, రాజ్యసభ సభ్యురాలు పీటీ ఉష ఇంట్లో తీవ్ర విషాదం నెలకొంది. ఆమె భర్త వెంగళిల్ శ్రీనివాసన్ కన్నుమూశారు. ఆయన వయసు 67 సంవత్సరాలు. నిన్న అర్ధరాత్రి ఆయన కోజికోడ్ జిల్లాలోని తిక్కోడి పెరుమల్పురంలో ఉన్న నివాసంలో అర్ధరాత్రి 1 గంట సమయంలో ఒక్కసారిగా కుప్పకూలారు. కుటుంబ సభ్యులు ఆయనను వెంటనే సమీపంలో ఉన్న ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అయితే, ఆయన అప్పటికే ప్రాణాలు కోల్పోయినట్టు వైద్యులు ప్రకటించారు. భర్త మరణించిన సమయంలో పీటీ ఉష ఇంట్లో లేరు. పార్లమెంటు సమావేశాల నేపథ్యంలో ఆమె ఢిల్లీలో ఉన్నారు. తన భర్త మరణవార్త తెలియగానే ఆమె వెంటనే ఢిల్లీ నుంచి బయల్దేరి కేరళకు చేరుకున్నారు.శ్రీనివాసన్ విషయానికి వస్తే... ఆయన కబడ్డీ ఆటగాడు. సీఐఎస్ఎఫ్ లో డిప్యూటీ ఎస్పీగా విధులు నిర్వహించి పదవీ విరమణ పొందారు. పీటీ ఉషకు ఆయన దూరపు బంధువు అవుతారు. 1991లో వీరు వివాహం చేసుకున్నారు. వీరికి ఉజ్వల్ విష్ణేష్ అనే కుమారుడు ఉన్నాడు. శ్రీనివాసన్ మృతి వార్తతో భారత క్రీడా ప్రపంచంలో విషాదం నెలకొంది. పీటీ ఉషకు క్రీడ, రాజకీయ ప్రముఖుల నుంచి సంతాపాలు వెల్లువెత్తుతున్నాయి.

మేడారం జనసంద్రం.. పోటెత్తిన భక్తజనం

గద్దెలపై కొలువుదీరిన సమ్మక్క, సారలమ్మ

వనదేవతల దర్శనానికి పోటెత్తిన భక్తజనం

నేడు మేడారం వెళ్లనున్న తెలంగాణ గవర్నర్

కరెంట్ కోతలతో ఉద్రిక్తత.. మంత్రి కారు ధ్వంసం

వీఐపీలకే ప్రాధాన్యమంటూ పోలీసులపై విమర్శలు

మేడారం మహా జాతరలో కీలక ఘట్టం ఆవిష్కృతమైంది. వన దేవతలు సమ్మక్క, సారలమ్మ గద్దెలపై కొలువుదీరడంతో శుక్రవారం భక్తులు పోటెత్తారు. దీంతో మేడారం పరిసరాలు జనసంద్రంగా మారాయి. భారీగా తరలివచ్చిన భక్తులను నియంత్రించడం అధికారులకు సవాలుగా మారింది. మరోవైపు తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ నేడు మేడారం సందర్శించి, వన దేవతలకు మొక్కులు చెల్లించుకోనున్నారు. ఈ నేపథ్యంలో అధికారులు ఆయన పర్యటనకు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు.బుధవారం సారలమ్మ, గురువారం సమ్మక్క గద్దెలపైకి చేరడంతో గురువారం అర్ధరాత్రి నుంచే భక్తులు తమ మొక్కులు చెల్లించుకోవడం ప్రారంభించారు. అయితే, గురువారం రాత్రి జాతర ప్రాంగణంలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో తీవ్ర ఉద్రిక్తత చోటుచేసుకుంది. ఆగ్రహానికి గురైన కొందరు భక్తులు, అక్కడే ఉన్న మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ కారు అద్దాలను, సమీపంలోని దుకాణాలను ధ్వంసం చేశారు.ఈ నెల 28న ప్రారంభమైన ఈ జాతర 31న ముగియనుంది. జాతరకు వీఐపీలు, వీవీఐపీలు పెద్ద సంఖ్యలో తరలివస్తుండటంతో భద్రతను కట్టుదిట్టం చేశారు. ఐజీ చంద్రశేఖర్ రెడ్డి నేతృత్వంలో 25 మంది ఐపీఎస్ అధికారులు భద్రతా ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. అయితే, పోలీసులు వీవీఐపీలు, వారి కుటుంబాల సేవకే పరిమితమై సామాన్య భక్తుల రద్దీని నియంత్రించడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికే డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, జువెల్ ఓరమ్ వన దేవతలను దర్శించుకున్నారు.

ఇద్దరు యువకుల వేధింపులు.. మహిళా కానిస్టేబుల్ ఆత్మహత్య

హనుమకొండలో మహిళా కానిస్టేబుల్ ఆత్మహత్య

ఇద్దరు యువకుల వేధింపులే కారణమని ఆరోపణ

పెళ్లి పేరుతో బంధువు, ఆ తర్వాత క్లాస్‌మేట్ వేధింపులు

'మీ వల్లే చనిపోతున్నా' అని ఫోన్ చేసి చెప్పి బలవన్మరణం

ఇద్దరు యువకుల నుంచి ఎదురైన తీవ్ర వేధింపులు భరించలేక ఓ మహిళా కానిస్టేబుల్ ఆత్మహత్యకు పాల్పడిన విషాద ఘటన హనుమకొండ జిల్లాలో చోటుచేసుకుంది. "మీ ఇద్దరి వల్లే నా జీవితం నాశనమైంది, అందుకే చనిపోతున్నా" అని నిందితుల్లో ఒకరికి ఫోన్ చేసి చెప్పిన తర్వాత ఆమె పురుగుల మందు తాగి ప్రాణాలు తీసుకుంది.పోలీసులు వెల్లడించిన వివరాల ప్రకారం.. వరంగల్ జిల్లా పర్వతగిరి మండలం సీత్యాతండాకు చెందిన అనిత.. వరంగల్ పోలీస్ కమిషనరేట్‌లో ఏఆర్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తోంది. ఆమె దూరపు బంధువైన రాజేందర్, నాలుగేళ్లుగా పెళ్లి చేసుకుంటానని నమ్మించి ఆమెతో సన్నిహితంగా ఉన్నాడు. అయితే, కొంతకాలంగా డ్యూటీలో ఉన్నప్పుడు వీడియో కాల్ చేయాలంటూ, ఇతరులతో మాట్లాడొద్దంటూ వేధించడం మొదలుపెట్టాడు. అతని ప్రవర్తన నచ్చకపోవడంతో ఈ పెళ్లికి అనిత కుటుంబసభ్యులు నిరాకరించారు.ఈ క్రమంలో అనితకు తన క్లాస్‌మేట్ అయిన జబ్బార్‌లాల్‌తో పరిచయం ఏర్పడింది. అతడిని వివాహం చేసుకోవాలని ఆమె నిర్ణయించుకుంది. ఈ విషయం తెలుసుకున్న రాజేందర్, జబ్బార్‌లాల్‌కు ఫోన్ చేసి అనిత గురించి చెడుగా చెప్పాడు. అప్పటి నుంచి జబ్బార్‌లాల్ కూడా ఆమెను వేధించడం ప్రారంభించాడు. పెళ్లి చేసుకోవాలంటే డబ్బులు ఇవ్వాలని డిమాండ్ చేయసాగాడు.ఇద్దరి నుంచి ఎదురవుతున్న మానసిక వేదనతో కుంగిపోయిన అనిత, ఈ నెల 27న రాజేందర్‌కు ఫోన్ చేసి కన్నీరు పెట్టుకుంది. మీ వల్లే ఆత్మహత్య చేసుకుంటున్నానని చెప్పగా, 'చస్తే చావు' అంటూ అతను నిర్లక్ష్యంగా బదులిచ్చాడు. దీంతో తీవ్ర మనస్తాపానికి గురైన అనిత వెంటనే గడ్డి మందు (కలుపు నివారణకు ఉపయోగించే మందు) తాగింది. కుటుంబసభ్యులు హుటాహుటిన ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ ఆమె మృతి చెందింది. మృతురాలి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు రాజేందర్, జబ్బార్‌లాల్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

PRINTED AND PUBLISHED BY V.NARSINGAM, ON BEHALF OF CH.V. PRABHAKAR RAO AND PRINTED AT SRI S HARADHA OFFSET PRINTERS. H.NO.9-14/8/3, BUGGARAM VILLAGE AND MANDAL, BUGGARAM GRAMAPANCHAYATH- 505454, JAGTIAL DISTRICT, TELANGANA STATE.. PUBLISHED AT 6-6-206,PADMA NAGAR, JAGTIAL - 505327, JAGTIAL DISTRICT, TELANGANA STATE. EDITOR : CH V. PRABHAKAR RAO, RNI . TELTEL/2021/81092 : PHONE : 9391533339 EMAIL: prajamantalu@gmail.com